


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 330 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం సోమవారం 4 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥
VOLUME :11 ISSUE :330 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM MON 4 AUGUST 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

# లిక్కర్ కేసు ఓ కట్టుకథ..

## రూ.2000 నోట్ల వీడియోతో కుట్ర బట్టబయలు

- అసలు ఉనికిలోనే లేని లిక్కర్ కేసును సృష్టించారని అంబటి ఆరోపణ
- వైసీపీ నేతలను వేధించడానికే ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శ
- చెవిరెడ్డి అనుచరుడిదంటూ ప్రచారంలో ఉన్న వీడియోపై కీలక వ్యాఖ్యలు
- రూ.2000 నోట్ల వీడియోతో కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్
- ఏసీబీ కోర్టు ఆదేశాలతో చంద్రబాబు సిట్ కుట్ర బయటపడిందన్నారు
- సీజ్ చేసిన నగదును పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:లిక్కర్ కుంభకోణం కేసు పూర్తిగా కల్పితమని, కేవలం వైసీపీ ఇమేజ్ ను దెబ్బతీసి, ఆ పార్టీ నాయకులను వేధించేందుకే ఈ కేసును బనాయించారని మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడికి సంబంధించిందంటూ ప్రచారంలో ఉన్న వీడియో, అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నంలో భాగమేనని విమర్శించారు.
ఆ వీడియోలో కనిపిస్తున్న రూ.2000 నోట్ల కట్టలే ప్రభుత్వ కుట్రకు నిదర్శనమని అంబటి పేర్కొన్నారు. "ఎన్నికలు జరిగింది 2024 మే నెలలో. రూ.2000 నోట్లను రిజర్వ్ బ్యాంక్ మే 2023 నాటికే చెలామణి నుంచి ఉపసంహరించుకుంది. ఇప్పుడు బయటపెట్టిన వీడియోలో స్పష్టంగా రూ.2000 నోట్ల కట్టలు కనిపిస్తున్నాయి. దీన్నిబట్టి ఎన్నికల్లో లిక్కర్ వ్యాపారంతో వచ్చిన డబ్బును చెవిరెడ్డి పంపిణీ చేశారన్న ఆరోపణ అబద్ధమని వారే ఒప్పుకున్నట్టు కాదా?" అని అంబటి ప్రశ్నించారు. ఈ వీడియోను లిక్కర్ కేసుకు ముడిపెట్టడం ద్వారా, చంద్రబాబు వేసిన సిట్ కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ కేసులో సిట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, అందుకే కేవలం గాలి మాటలు చెబుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కేసులో భాగంగా సీజ్ చేసిన రూ.11 కోట్ల

వివరాలు 2లో..

## కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి జగన్ లో ఫ్రస్టేషన్



- మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ పై మండిపడ్డ మంత్రి పార్థసారథి
- భయంతో దిగజారి మాట్లాడుతున్నాడని ఫైర్
- చంద్రబాబుపై ఆయన వ్యాఖ్యలే నిదర్శనం
- ముగ్గురు ముఖ్యమంత్రుల వద్ద పనిచేశా కానీ ఇలాంటి రాజకీయం ఎప్పుడూ చూడలేదన్న మంత్రి
- గెలిచినా ఓడినా నాయకులు ప్రజా సమస్యలపై హుందాగా మాట్లాడేవారని వెల్లడి
- జగన్ ఇందుకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడని విమర్శ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం చూసి జగన్ లో ఫ్రస్టేషన్ పెరిగిపోయి వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నాడని సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. ఈ రోజు ఉదయం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ

వివరాలు 2లో..

## కొడాలి నానికి విశాఖ పోలీసుల నోటీసులు.. మరోకేసు నమోదు



పెన్ పవర్ డెస్క్:ఏపీ మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొడాలి నానికి విశాఖ పోలీసులు నోటీసులు జారీ చేశారు. 2024లో ఏయూలా కాలేజీ విద్యార్థిని అంజనప్రియ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో విచారణకు హాజరుకావాలని

వివరాలు 2లో..

## బాపట్ల జిల్లాలో ఘోరం.. క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు మృతి



పెన్ పవర్ డెస్క్:బాపట్ల జిల్లా బల్లికురవలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గ్రానైట్ క్వారీలో బండ రాళ్లు మీద పడడంతో ఆరుగురు కార్మికులు దుర్మరణం పాలయ్యారు. పదహారు మంది కార్మికులు

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

### కొడాలి నానిపై వేలాడుతున్న కేసుల కత్తి..ఎప్పుడైనా అరెస్టంటూ?

మాజీ మంత్రి కొడాలి నాని అరెస్ట్ ఎంతో దూరం లేదని ప్రచారం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తడంతో ఆయన ఎక్కువగా హైదరాబాద్ లోనే ఉంటున్నారు. ఇటీవల కొడాలి నానికి గుండెకు సంబంధించిన ర్జరీ జరిగింది. ఇప్పటికీ ఆయన పూర్తిగా కోలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బయటకు వచ్చినప్పుడు, పోలీస్ స్టేషన్ కు సంతకాలు పెట్టేందుకు వచ్చినప్పుడు కూడా ఆయన బెల్టు తో వస్తున్న ఫొటోలను కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పార్టీ అధికారం కోల్పోవడంతో పాటు గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయి కొడాలి నాని నియోజకవర్గానికి కూడా దూరంగా ఉంటున్నారు.

**తిరుగులేదని భావించి...**

గుడివాడలో గెలుపునకు తనకు తిరుగులేదనుకున్న కొడాలి నానికి మొన్నటి ఎన్నికల్లో తొలిసారి ఓటమి ఎదురయింది. పార్టీలు మారినా గుడివాడ ప్రజలు కొడాలి నానిని అదరించారు. కానీ మొన్నటి ఎన్నికల్లో మాత్రం ఆయనకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. నిజానికి ఆ ఓటమిని కొడాలి నాని ఊహించలేదు. గుడివాడ ప్రజలు తనను వదులుకోరని కొడాలి నాని పూర్తి విశ్వాసంతో ఉన్నారు. కానీ అది అతి విశ్వాసం అన్నది తేలిపోయింది. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఇటు అసెంబ్లీ సమావేశాల్లోనూ, అటు మీడియా సమావేశాల్లోనూ, టీవీ ఇంటర్వ్యూల్లో కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ నేతలు మర్చిపోలేకపోతున్నారు. ఆయనను అరెస్ట్ చేయాల్సిందేనంటూ టీడీపీ సోషల్ మీడియాలో ఎక్కువగా డిమాండ్ వినిపిస్తుంది.

**టీడీపీ నుంచి తొలిసారి గెలిచి...**

2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. గుడివాడలో తనకు తిరుగులేదని భావించిన కొడాలి నాని ప్రత్యర్థులను ఒక ఆటాడుకున్నారు.దీంతో అధికారం కోల్పోయిన తర్వాత కొడాలి నాని అనుచరులు వరసగా అరెస్ట్ అవుతున్నారు. అన్ని కేసులు బయటకు తీసి పోలీసులు వరస బెట్టి అరెస్ట్ లు చేస్తున్నారు. తర్వాత వంతు కొడాలి నానిదేనని అంటున్నారు.

**మరో కేసు నమోదు కావడంతో...**

తాజాగా మాజీ మంత్రి కొడాలి నానిపై మరో పోలీసు కేసు నమోదయింది. విశాఖ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రబాబు నాయుడుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై అంజనా ప్రియ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రబాబుతో పాటు వారి కుటుంబ సభ్యులను కించపర్చే విధంగా పోస్టులు పెట్టారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ మంత్రి కొడాలి నాని పై పోలీసులు కేసు నమోదు చేసి గుడివాడలోని ఆయన ఇంటికి వెళ్లి 41 సీఆర్పీసీ సెక్షన్ కింద నోటీసులు జారీచేశారు. విచారణకు రావాలని కోరారు. అయితే కొడాలి నాని గుడివాడలో లేకపోవడంతో ఇంటివద్ద ఉన్న నాని మనుషులకు ఆ నోటీసులు అందచేసినట్లు తెలిసింది. ఈ కేసులో కొడాలి నానిని అరెస్ట్ చేసే అవకాశం ఎక్కువగా ఉందని కృష్ణా జిల్లాలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# కొడాలి నానికి విశాఖ పోలీసుల నోటీసులు.. మరోకేసు నమోదు

- మొదటి పేజీ తరువాయి

ఈ నోటీసులలో ఆదేశించారు.వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన కొడాలి నాని మూడేళ్ల పాటు చంద్రబాబు, లోకేశ్ లను అసభ్యకరరీతిలో దుర్భాషలాడారని అంజనప్రియ ఆరోపించారు. ఓ మహిళగా ఆ తిట్లను భరించలేకపోయానని 2024లో విశాఖ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐటీ యాక్టు U/s 353(2), 352, 351(4) సెక్షన్ల కింద సి.ఐ రమణయ్య అప్పట్లో కేసు నమోదు చేశారు.తాజాగా ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆదివారం కృష్ణా జిల్లా గుడివాడలోని కొడాలి నాని ఇంటికి వెళ్లిన పోలీసులు విచారణకు రావాలని 41 సీఆర్పీసీ నోటీసులు అందజేశారు.

## బాపట్ల జిల్లాలో ఘోరం.. క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు మృతి

- మొదటి పేజీ తరువాయి

క్వారీలో పని చేస్తుండగా అకస్మాత్తుగా బండరాళ్లు కిందపడ్డాయని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. దీంతో ఆరుగురు కార్మికులు రాళ్ల కింద పడి నలిగిపోయారని వివరించారు. చనిపోయిన వారంతా ఒడిశాకు చెందిన వారని అధికారులు వివరించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

## లిక్కర్ కేసు ఓ కట్టుకథ..

- మొదటి పేజీ తరువాయి

నగదు విషయంలో ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ప్రభుత్వ కుట్ర బయటపడిందని తెలిపారు. ఆ నోట్ల సీరియల్ నంబర్లను నమోదు చేసి, ఫోటోలు తీయమని కోర్టు ఆదేశించినప్పటికీ, సిట్ అధికారులు ఆ ఆదేశాలను పక్కనపెట్టి, ఆధారాలను నాశనం చేసేందుకు ఆ నగదును హడావుడిగా బ్యాంకులో జమ చేశారని ఆరోపించారు. దీనిపై నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించగా, స్వాధీనం చేసుకున్న నోట్లను విడిగా ఉంచాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం ఆ నోట్లను పరిశీలిస్తే, అవి ఎప్పుడు, ఎక్కడి నుంచి విడుదలయ్యాయో తేలిపోతుందని అంబటి వివరించారు. ఒక తప్పును కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబు ప్రభుత్వం మరొక తప్పు చేస్తోందని, అక్రమ అరెస్టులు, తప్పుడు ప్రచారాలతో రాజకీయ లబ్ధి

పొందాలని చూస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలు ఈ పరిణామాలన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారని అన్నారు. కాగా, 2019-24 మధ్య వైసీపీ హయాంలో లిక్కర్ కుంభకోణం జరిగిందని, సుమారు రూ.3,500 కోట్ల మేర అక్రమాలు జరిగాయని సిట్ ఆరోపిస్తోంది. దీనిపై విచారణ కొనసాగుతోంది.

## కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చూసి జగన్ లో ఫ్రస్టేషన్

- మొదటి పేజీ తరువాయి

చేస్తున్న రాజకీయాలు, ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్న తీరు, వారి విధ్వంసకర విధానాలు చూస్తుంటే రాజకీయ నేతగా చాలా బాధేస్తున్నదని మంత్రి చెప్పారు. రాజకీయ నేపథ్య కుటుంబం నుంచి వచ్చిన తనకు మూడు దశాబ్దాల అనుభవం ఉందని గుర్తుచేస్తూ.. నాలుగైదు దశాబ్దాల నుంచి రాజకీయాలను చాలా దగ్గరి నుంచి చూస్తున్నానని తెలిపారు. అయితే, వైసీపీ నేతలు వ్యవహార తీరును తాను ఏనాడూ చూడలేదని చెప్పారు.

ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఎంత ఘాటుగా విమర్శించినా కూడా ఎక్కడా ఎవరూ వ్యక్తిగత దూషణలకు పాల్పడలేదని మంత్రి పార్థసారథి చెప్పారు. నేతలను కించపరిచేలా మాట్లాడటం, అప్రజాస్వామికంగా మాట్లాడటం ఎక్కడ కూడా తాను చూడలేదన్నారు. అధికార పక్షాన్ని కించపరచడం కోసం అరాచక శక్తులని ప్రోత్సహించడం ఎప్పుడూ చూడలేదన్నారు. హుందాగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సమస్యలే ప్రాధాన్యంగా పోరాటాలు చేసేవారని చెప్పారు. ఈరోజు వైసీపీ, ఆ పార్టీ అధినేత జగన్ తీరు చూస్తుంటే చాలా బాధేస్తుందని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. గెలుపు ఓటములు సర్వసాధారణం కానీ గెలిచినా ఓడినా నైతిక రాజకీయాలు చేయాల్సిన బాధ్యత ప్రతీ రాజకీయ నేతపై ఉందన్నారు. బహుశా వైనాట్ 175 నుంచి 11 స్థానాలకు పడిపోవడం మూలంగా జగన్ ఈ విధంగా అనైతికంగా, అప్రజాస్వామికంగా విధ్వంసకర పరిస్థితులను ప్రోత్సహించే విధంగా ప్రవర్తిస్తున్నారు అనిపిస్తోందని మంత్రి తెలిపారు.

ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి క్రిందిస్థాయి నాయకులకు ఆదర్శంగా ఉండాలని మంత్రి పార్థసారథి హితవు పలికారు. జగన్ పర్యటనలు చూసినా, ఆయన ఉపన్యాసాలు చూసినా ఆయన పత్రికా ప్రకటనలు చూసినా ఆయనలో ఒక ఫ్రస్టేషన్ కనపడుతుందని మంత్రి చెప్పారు. ఆయనలో ఏదో ఒక అభద్రతా భావం కనపడుతుందన్నారు. మాటల్లో నియంత్రణ కోల్పోవటం, వ్యక్తిగత దూషణలకి దిగటం జగన్ కు పరిపాటైందన్నారు. తాను ముగ్గురు ముఖ్యమంత్రుల దగ్గర పనిచేశానని, ప్రస్తుతం చంద్రబాబు దగ్గర మంత్రిమండలిలో ఉన్నానని చెప్పారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు.. ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి కానివ్వండి, రోశయ్య కానివ్వండి కిరణ్ కుమార్ రెడ్డి కానివ్వండి ఎవరైనా సరే.. నాలాంటి మంత్రులు ఎవరైనా అప్రజాస్వామికంగా మాట్లాడినా లేకపోతే ఏదైనా భాష సరిగ్గా లేకున్నా కూడా మందలించేవాళ్ళని చెప్పారు. కానీ మమ్మల్ని ఎక్కడా తిట్టమని ప్రోత్సహించలేదని వివరించారు. ప్రస్తుతం చంద్రబాబు కూడా కక్షపూరిత రాజకీయాలు మనకు వద్దని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా మీ మీ ఆలోచనలకి పదును పెట్టాలని చెబుతారని మంత్రి వివరించారు.

**గంజాయి బ్యాచ్ కు పరామర్శలా..?**

గంజాయికి బానిసై సమాజంలో అరాచకాలు సృష్టిస్తూ ఆడపిల్లల్ని హింసిస్తున్న వారి మీద పోలీసులు చర్యలు తీసుకుంటే జగన్ వెళ్లి వారిని పరామర్శిస్తున్నాడని మంత్రి మండిపడ్డారు. శాసన సభ్యురాలిగా ఉన్న ఒక సోదరిని నీచాతి నీచంగా దిగజారి మాట్లాడితే అతన్ని మందలించాల్సింది పోయి పరామర్శిస్తున్నాడంటే ఏమనుకోవాలని ప్రశ్నించారు. మహిళల పట్ల జగన్ కు ఉన్న గౌరవం ఏమిటో ఈ ఘటనే చెబుతుందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ఆమోదయోగ్యమైన భాష మాట్లాడితే తప్పులేదు. కానీ చాలా అనైతికంగా, దిగజారుడుతనంగా మాట్లాడితే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని మంత్రి హెచ్చరించారు. ఇటువంటి భాషని వాడే మీరందరూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సంక్షేమం గురించి మాట్లాడడం వేరు, సంక్షేమం చేసి చూపించడం వేరని మంత్రి చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వంలో అందే సంక్షేమం కొత్త చరిత్రను తిరగరాస్తోందని, గతంలో ఏ ప్రభుత్వాలు ఇవ్వని స్థాయి సంక్షేమాన్ని నేడు ప్రజలు అందుకుంటున్నారని మంత్రి చెప్పారు. జగన్ లో ఫ్రస్టేషన్ కు ఇది కూడా కారణం కావచ్చని ఎద్దేవా చేశారు. ప్రజల్లో అన్ని వర్గాల్లో పాజిటివ్ వస్తే తన పరిస్థితి ఏమీ మిగలదు అని ఇలా వ్యవహరిస్తున్నాడు అనిపిస్తోందని మంత్రి అభిప్రాయపడ్డారు.

'దేశంలో నెలకు 64 లక్షల మందికి రూ.2720 కోట్లు పింఛన్లు ఇచ్చే ప్రభుత్వం మరొకటి ఉందా? ఈ నెలతో కలిపి దగ్గర దగ్గర రూ. 40 వేల కోట్లు కేవలం పింఛన్లపై ఖర్చు చేశాం. ఇది కాదా సంక్షేమం? తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ ఆర్థిక సాయం చేశాం. దీనికి దాదాపు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశాం. నాకు డబ్బులు పడలేదు అని ఎవరూ చెప్పే పరిస్థితి లేకుండా చేశాం. దీన్ని ఏమంటారు? 204 అన్న క్యాంటీన్లు పెట్టాం.... ఇప్పటికి 4 కోట్లమందికి పైగా భోజనాలు చేశారు. అంటే జగన్ భాషలో పేదల కడుపునింపడం సంక్షేమం కాదా? 47 లక్షల మంది అన్నదాతల ఖాతాల్లో దాదాపు రూ.3200 కోట్లు వారి అకౌంట్లో జమ చేశాం .....ఇది రైతు సంక్షేమం కాదా? ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నాం. జగన్ కళ్లు మూసుకుని సంక్షేమం లేదు అని పదే పదే గోల పెట్టి... అదే నిజం అని చెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం.... పోలీస్ రిక్రూట్ మెంట్ చేస్తున్నాం...పెట్టుబడుల తెచ్చి మళ్లీ పారిశ్రామిక రంగంలో ఊపు తెచ్చాం. ఇవన్నీ కనిపించడంలేదా ?ప్రతి వర్గానికి సాయంగా నిలుస్తున్నా.. ఉచిత ఇసుక తెచ్చి నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు పోరాటాలు చేయాలి. ప్రభుత్వాలను పశ్నించాలి. ప్రజల కోసం పనిచేయాలి. కానీ జగన్ కు తన సొంత ఉనికి, ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టవు. ఇలాంటి రాజకీయ పార్టీలు చరిత్రలో మనుగడ సాగించలేదు.. జగన్ యాక్సిడెంటల్ చీఫ్ మినిస్టర్ గా చరిత్రలో నిలిచిపోతారు ప్రజలు కూడా ఇలాంటి వారి పట్ల చైతన్యంతో ఉండాలి. మంచి చెడు చూడాలి' అని మంత్రి పార్థసారథి చెప్పారు.

## బాపట్ల జిల్లా క్వారీ ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి



బాపట్ల జిల్లాలోని బల్లికురవ క్వారీలో ఘోర ప్రమాదం చోటుచేసుకుని కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్వారీలో పనులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా రాళ్లు కూలిపడటంతో ఈ విషాదం జరిగింది. ఈ ఘటనలో పలువురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద వివరాలు తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించారు. కార్మికులు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. గాయపడిన వారికి తక్షణమే అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను సీఎం ఆదేశించారు. అదే సమయంలో, ఈ ప్రమాదం జరగడానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక సమర్పించాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## గడ్కరీ ఇంటికి బాంబు బెదిరింపు... గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న పోలీసులు!

- నాగ్‌పూర్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు
- ఫోన్ కాల్‌తో పోలీసులు అప్రమత్తం
- బాంబ్ స్క్వాడ్ తనిఖీలు.. నకిలీ కాల్‌గా నిర్ధారణ
- కాల్ చేసింది మద్యం షాపులో పనిచేసే వ్యక్తిగా గుర్తింపు



కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నివాసానికి బాంబు బెదిరింపు రావడం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో తీవ్ర కలకలం సృష్టించింది. ఆదివారం ఓ ఆగంతకుడు ఫోన్ చేసి, గడ్కరీ ఇంట్లో బాంబు పెట్టినట్టు బెదిరించాడు. ఈ సమాచారంతో నగర పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ఉన్నతాధికారులు అప్రమత్తమై, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.హుటాహుటిన గడ్కరీ నివాసానికి చేరుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇంటి ఆవరణతో పాటు లోపల కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి అంగుళాన్ని జల్లెడ పట్టినా ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇది కేవలం ఓ ఆకతాయి చేసిన నకిలీ కాల్ అని నిర్ధారణకు వచ్చారు.మరోవైపు, ఈ బెదిరింపు కాల్‌ను పోలీసులు చాలా సీరియస్‌గా తీసుకున్నారు. ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన క్రైమ్ బ్రాంచ్ బృందాలు కొద్ది వ్యవధిలోనే నిందితుడి ఆచూకీని కనుగొన్నాయి. నాగ్‌పూర్‌లోని తులసి బాగ్ రోడ్డులో ఉన్న ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉమేష్ విష్ణు రౌత్‌గా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడు ఎందుకు ఈ బెదిరింపు కాల్ చేశాడనే దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు



**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 3 :** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 5 నుంచి 7వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఆగస్టు 4న అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలోని సంపంగి ప్రాకారంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఆగస్టు 5న పవిత్రాల ప్రతిష్ఠ, ఆగస్టు 6న పవిత్ర సమర్పణ, ఆగస్టు 7న పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాల్లో ఆగస్టు 4న అంకురార్పణ కారణంగా సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అదేవిధంగా, ఆగస్టు 5న అష్టదళ పాద పద్మారాధన సేవ, ఆగస్టు 7న తిరుప్పావడ సేవ పాటు పాటు ఆగస్టు 5 నుండి 7వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దయ్యాయి.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# జడ్పిటిసి ఉప ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

### పులివెందుల జడ్పిటిసి స్థానానికి 12, ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానానికి 21 నామినేషన్లు

### పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్లు 10601 ఓటర్లు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ స్టేషన్లు 24606 ఓటర్లు : డిఆర్వో విశ్వేశ్వర నాయుడు



వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 3 : పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని బోర్డ్ రూమ్ హాల్ నందు పులివెందుల,ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల నిర్వహణ పై జెడ్పి సీఈవో ఓబులమ్మ తో కలిసి డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్వో విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ... జెడ్పిటిసి ఉప ఎన్నికల నిర్వహణకు సంబంధించి.. రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూలు ప్రకటించిన నేపథ్యంలో.. ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందితో పాటు ఓటర్లు, సాధారణ ప్రజానీకం అందరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పులివెందల రెవిన్యూ డివిజన్, కడప రెవెన్యూ డివిజన్ అంతట అమలులో ఉంటుందని తెలిపారు. సెల్సిటివ్, క్రిటికల్, వల్నరబిలిటీ పోలీస్ స్టేషన్లను గుర్తించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జడ్పిటిసి ఉప ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులకు విధులను కేటాయించడం జరిగింది.జడ్పిటిసి ఉప ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పులివెందుల ఆర్వోగా నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఒంటిమిట్ట ఆర్వోగా డిప్యూటీ కలెక్టర్ రిమ్స్ రంగస్వామి లను నియమించారన్నారు. జులై 30 నుంచి ఆగస్టు 1వ తేదీ సాయింత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించామన్నారు. పులివెందుల స్థానానికి సంబంధించి 12 నామినేషన్లు, ఒంటిమిట్ట స్థానానికి సంబంధించి 21 నామినేషన్లు వచ్చాయన్నారు. శనివారం నామినేషన్ పత్రాల పరిశీలించడం జరిగిందన్నారు.ఆగస్టు 3వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు తిరస్కరణకు గురైన వాటిపై అప్పీలేట్ అధికారికి ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు.ఆగస్టు 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితా వెల్లడిస్తామన్నారు. పులివెందులలో 15 పోలింగ్ స్టేషన్లు 10601 ఓటర్లు, ఒంటిమిట్టలో 30 పోలింగ్ స్టేషన్లు 24606 ఓటర్లు ఉన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కే ప్రకాష్ బాబు బాబు, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సుధాకర్,పులివెందుల ఏఆర్ఓ కృష్ణమూర్తి, ఒంటిమిట్ట ఏఆర్ఓ సుజాతమ్మ, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**నంద్యాల, పెన్ పవర్ ఆగస్టు 03 :** ఈ నెల 4న సోమవారం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11:30 గంటలకు ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుంది. జిల్లా అధికారులందరూ ఉదయం 11.00 గంటలకు ఈ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు డివిజన్ పరిధిలోని ప్రజలు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టర్‌కి సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. అలాగే నంద్యాల కలెక్టరేట్ తోపాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి యధావిధిగా విజ్ఞప్తులు స్వీకరిస్తారని చెప్పారు. అర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా "meekosam.ap.gov.in"లో ఆన్‌లైన్‌లో ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు.

## మీ కోసం కాల్ సెంటర్

## 1100 సేవలను వినియోగించుకోండి

- ఈనెల 04వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 02 :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**: ఈనెల 04వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ**

ఈనెల 04వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇంచార్జి జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సింగపూర్ పర్యటన ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయి : మంత్రి టి.జి.భరత్



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 3 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మరియు పరిశ్రమల శాఖ మంత్రిగా తాము జరిపిన సింగపూర్ పర్యటన సత్ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ మీడియా సమావేశంలో తెలియజేశారు. ఆదివారం ఉదయం స్థానిక మౌర్య హోటల్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి టి.జి.భరత్ మీడియా సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన సింగపూర్ పర్యటన విశేషాలు తెలియజేస్తూ పలు విషయాలు తెలియజేశారు. మీడియా సమావేశంలో మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన సింగపూర్ పర్యటన విజయవంతమైనదని తెలిపారు. సింగపూర్ పర్యటనలో ప్రస్తుత అధ్యక్షులు మరియు గత అధ్యక్షులతో పాటు అక్కడ వ్యాపారస్తులతో, బిజినెస్ మ్యాగ్నెట్లతో సమావేశాలు నిర్వహించి ఆంధ్రప్రదేశ్ కు పెట్టుబడులు తీసుకు రావడానికి ప్రయత్నం చేశామని తెలిపారు. 2019 సంవత్సరం తర్వాత ఏర్పడిన ప్రభుత్వం వలన ఆంధ్రప్రదేశ్ పై సింగపూర్ కు వ్యతిరేక భావం వచ్చినదని ..ఆ వ్యతిరేకతను పోగొట్టడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బృందం మూడుసార్లు బిజినెస్ మాగ్నెట్లతో, పెట్టుబడిదారులతో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించామని.. ఈ సమావేశాల ద్వారా ఆంధ్రప్రదేశ్ పై ఉన్న వ్యతిరేక దృష్టిని తొలగించగలిగామని తత్ఫలితంగా రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ కు మంచి సత్ఫలితాలు పెట్టుబడుల రూపంలో వస్తాయని తెలియజేశారు. సింగపూర్ కు ఎన్నో ఏళ్లుగా పటిష్టమైన మంచి ప్రభుత్వం ఉన్నదని అందుకే ఆ దేశం ప్రపంచంలోనే గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా కూటమి ప్రభుత్వం పటిష్టంగా ఉండి రెండు దశాబ్దాల పాటు కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ కు సింగపూర్ దేశం నుండి వస్తారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సింగపూర్ దేశ పర్యటనలో పలు ప్లాంట్ లు, పోర్టులు మరియు ఇతర ప్రదేశాలు సందర్శించడం జరిగిందని తెలుపుతూ అక్కడ దాదాపు అన్ని పరిశ్రమలలో షోకేస్ లో బొమ్మలు ఉన్న విధంగా ఉండటం చూసామని అవి అన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పనులు జరుగుతూ ఉంటాయని తెలిపారు. ఇక ఓర్వకల్లులో రిలయన్స్ కంపెనీ పెట్టుబడులు పెట్టుతున్నదని తెలిపారు. పైలట్ ట్రైనింగ్ కోర్సులు చేసిన వారికి మంచి జీతాలతో ఉద్యోగాలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే కోయంబత్తూర్ కంపెనీ ఓర్వకల్లుకు వచ్చిందని ఇప్పుడు బాంబే కంపెనీ కూడా వస్తున్నదని కావున పైలట్ కోర్సులు నేర్చుకోవాలని మంత్రి తెలిపారు. ముచ్చుమరి నుండి ఓర్వకల్లు హబ్ కు నీటిని తీసుకొచ్చే పనులు 90% పైగా పూర్తయ్యాయని.. పలు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల వలన ఓర్వకల్లు లో ఉన్న ఎయిర్పోర్టు, ఇండస్ట్రియల్ కారిడార్ తో పాటు జిల్లా కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. త్వరలో దేశంలోనే అత్యున్నత సౌకర్యాలు మరియు ఇన్సెంటివ్ ల ప్రకటన రాష్ట్ర ప్రభుత్వం చేయబోతున్నదని. దశాబ్దాల నుండి చర్చకు ఉన్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు త్వరలో పూర్తి అయిపోతుందని తెలియజేశారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఉన్న వలసలు ఆపటానికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని తెలిపారు. పరిశ్రమలను నెలకొల్పడం వలన వలసలు ఆపవచ్చని, అందుకు సరియైన శిక్షణ కలిగి ఉండాలని తెలియజేశారు. మూతపడుతున్న చిన్న తరహా పరిశ్రమలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించి వాటిని నిలదొక్కుకునే విధంగా చర్యలు తీసుకుంటామని తద్వారా వలసలు ఆపే ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. రాష్ట్రంలోని టిడ్కో గృహాలను త్వరలో నివాసయోగ్యంగా మార్చి ప్రజలకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇక హైకోర్టు బెంచ్ కర్నూలుకు వచ్చే ప్రక్రియ వేగంగా సాగుతోందని చెప్పారు. గత ప్రభుత్వ పాలకులు లిక్కర్ స్కామ్ లో పాలుపంచుకోవడం వలన రాష్ట్రానికి తీవ్రంగా ఆర్థిక నష్టం జరిగిందని వారిపై చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా మంత్రి తెలియజేశారు. వారు ఇమెయిల్ ద్వారా సింగపూర్ ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ గురించి చెడుగా ప్రచారం చేశారని, ముఖ్యమంత్రి వయసు మీరిపోయారని మరియు మహిళా ప్రజాప్రతినిధులను నీచంగా విమర్శించే చర్యలు చేస్తున్నారని భవిష్యత్తులో వారికి ఇప్పుడు ఉన్న 11 స్థానాలు కూడా ఉండవని తెలియజేశారు.

### వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం




**శ్రీశైలం, పెన్ పవర్ ఆగస్టు 3 :** వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శ్రీశైలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతోందన్నారు. శ్రీశైలంలోని ప్రాథమిక హెల్త్ సెంటర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో పనిచేసే వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. చేతిలో చిల్లి గవ్వలేని పేదలు మాత్రమే ప్రభుత్వాసుపత్రులకు వస్తుంటారని వైద్యులు పేదల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మానవత్వంతో వారికి వైద్యం అందించాలన్నారు. పీహెచ్సీలలో గర్భవతులకు అన్ని వసతులు కల్పించి డెలివరీల సంఖ్య పెంచి ప్రతి ఒక్కరు ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖప్రసవం గావించే విధంగా చూడాలన్నారు. వైద్యులు రోగులకు అవసరమైనన్ని మందులు అందుబాటులో ఉంచుకొని మందుల సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పీహెచ్ సి లలో నెలకు ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి. ప్రతి వార్డులో అన్ని రకాల పరికరాలు ఉన్నాయా లేదా..ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అక్కడి వైద్య సిబ్బందిని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు.

## పురాతనమైన శ్రీ బుగ్గ మల్లేశ్వర కోనేటి లో పూడికతీత





**కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** కడప జిల్లా, చింతకొమ్మదిన్నె మండలం, బుగ్గలపల్లె, నాగిరెడ్డి పల్లె, గూడావాండ్లపల్లె, బుగ్గ అగ్రహారం, మరియూ కడప నగరం నుంచి వచ్చి స్వచ్ఛందంగా అందరూ, శ్రీ బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయం కోనేటిలో ఉన్నటువంటి పూడికను తీయడానికి వచ్చి పాల్గొన్నారు. అతి పురాతనమైన ఎన్నో వందల సంవత్సరాల క్రితం నిర్మించినటువంటి దేవాలయం అని చెప్పి మనకు కొన్ని ఆధారాలు ఉన్నాయి. పూర్వం భృగు మహర్షి అని మహర్షి ఇక్కడ తపస్సు చేసి ఈ దేవాలయాన్ని నిర్మించినడని, పూర్వకాలం నుంచి నానుడి. అదేవిధంగా ఈరోజు బుగ్గ శివాలయంలో కోనేటిలో ఉన్నటువంటి గుడిని ఆ కోనేరులో పూడిక తీయడానికి చుట్టుపక్కల ఉన్నటువంటి గ్రామస్తులు గూడా ప్రభాకర్ రెడ్డి గూడా సదానంద రెడ్డి బొగ్గడి సుధాకర్ రెడ్డి అలాగే భాస్కర్ రెడ్డి మరియు గ్రామస్తులు గ్రామంలో ఉన్నటువంటి మహిళలు, చిన్న పిల్లలతో సహా చాలామంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు కూడా పాల్గొనడం జరిగింది. ఆగస్టు 10వ తేదీ ఉదయం ఆదివారం పరిసర ప్రాంతాలలోని భక్తులు పాల్గొని , దైవ కృపకు పాత్రులు కాగలరని, ఆశిస్తున్నాము.

# కర్ణాటక గవర్నర్‌కు స్వాగతం...





**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 3 :** తిరుమల పర్యటన నిమిత్తం విచ్చేసిన కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాత్‌కి తిరుమలలో సాదర స్వాగతం పలుకుతున్న టిటిడి ఓఎస్‌డీ ఎం.ఎస్. నాయక్, టిటిడి అధికారులు తదితరులు.

## డిస్టిక్ అండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ



**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 3 :** ఆగష్టు 05 నుండి 20 వరకు తిరుపతిలో డిస్టిక్ అండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ జరగనున్నదని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం రాత్రి కలెక్టర్ క్యాంప్ కార్యాల యం నుండి ఈ నెల తిరుపతిలో జరగనున్న డిస్ట్రిక్ట్ మరియు జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహణ, ఏర్పాట్లపై తిరుపతి నగరపాలక కమీషనర్ ఎం.మౌర్యతో కలసి సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29 న జాతీయ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకోవడం లో భాగంగా ఈనెల 5 నుండి 20 వరకు తిరుపతిలో జరగనున్న డిస్టిక్ అండ్ జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరుగుతుందని ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులు వారికి కేటాయించిన విధులను సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలలో వివిధ జిల్లాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొననున్నారని వీరికి ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, అథ్లెటిక్స్ , వాలీబాల్ , బాస్కెట్బాల్, హాకీ, కబడ్డీ, కోకో, షటిల్ స్పోర్ట్స్ నందు పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటగా 5 నుండి 10 వరకు డిస్ట్రిక్ట్ లెవెల్, 11 నుండి 15 వరకు జోనల్ లెవెల్, 16 నుండి 20 వరకు స్టేట్ లెవెల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రీడల నిర్వహణకు సంబంధించి టీటీడీ, ఎస్.వి.యూనివర్సిటీ , తిరుపతి నగరపాలక సంస్థ సమన్వయంతో పనిచేయాలని అన్నారు. డి ఎస్ డి ఓ జిల్లాలోని పి.ఈ.టి లను క్రీడల నిర్వహణకు వినియోగించుకోవాలని, క్రీడాకారులకు భోజన , త్రాగు నీరు సదుపాయం కల్పించాలని తెలిపారు. డిఎం హెచ్ ఓ క్రీడాకారులకు క్రీడా మైదానాల వద్ద అవసరమైన వైద్య సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ కు జిల్లా విద్యా శాఖ అధికారి, డి.ఎస్.డి.ఓ, టిటిడి, యూనివర్సిటీ అధికారులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ-పీ.యం కిసాన్ పథకం నిధులు జమ

– జాయింట్ కలెక్టర్



**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 2 :** పాకాల మండలంలో 5029 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పీ.ఎం కిసాన్ పథకం కింద మూడు కోట్ల 52 లక్షల రూపాయలు రైతుల ఖాతాలో జమ శుభం బన్సల్. పాకాల మండలం లో మూడు కోట్ల 52 లక్షల రూపాయలు పెట్టుబడి సాయం కింద 5029 మంది లబ్ధిదారుల రైతులకు వారి ఖాతాలో జమ చేస్తున్నామనీ, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండపం కే వడ్డేపల్లి లో రైతు సేవ కేంద్రంలో నందు అన్నదాత సుఖీభవ పీ.ఎం కిసాన్ మొదటి విడత పథకాన్ని జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్,జడ్పిటిసి నంగా పద్మజాబాబు రెడ్డి,టిడిపి నేత బొల్లినేని మహేష్ కుమార్,టిడిపి చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సావిత్రి తో కలిసి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..పాకాల మండలం లో మూడు కోట్ల 52 లక్షల రూపాయలు పెట్టుబడి సాయం కింద 5029 మంది లబ్ధిదారుల రైతులకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అర్హులైన రైతులకి వెబ్లాండ్ లో ఆధార్ అనుసంధానం లేని వాటికి లింకు లేని వారు లింక్ చేసుకోవాలని తెలిపారు. మ్యుటేషన్ సంబంధించిన పనులను త్వరితగతన పూర్తిచేయాలని అర్హులైన లబ్ధిదారుల రైతులకు లబ్ధి చేకూర్చేలా చూడాలని రెవిన్యూ శాఖను ఆదేశించారు.మండలంలో లబ్ధిదారులైన ఏ రైతు కూడా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందలేదని ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కళ్యాణ్,వ్యవసాయ అధికారి కుమారి,సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## శుభప్రద కమ్యూనిటీ భవనంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవం

**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఆగష్టు 03 :** ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా స్థానిక శుభప్రద కమ్యూనిటీ భవనం నందు మహంకాళి వెంకట శేషయ్య ఆధ్వర్యంలో లతన క్లబ్స్, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ , పెన్షనర్స్ అసోసియేషన్ మిత్రులతో కలిసి ప్రముఖ ఆర్ఎంపీ డాక్టర్ హనుమంతరావు, కొల్లా వెంకయ్య లను మహంకాళి వెంకట శేషయ్య వారి మిత్ర బృందం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చిరకాల మిత్రులు ఇద్దరినీ ప్రపంచ స్నేహితుల దినోత్సవ సందర్భంగా సన్మానం చేయడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ రంగనాథం, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ డాక్టర్ కంచర్ల సుబ్బారావు, ఓరుగంటి ప్రసాద్, రిటైర్డ్ టీచర్ సముద్రాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# స్నేహితుల దినోత్సవం
# మున్సిపల్ హై స్కూల్ గాంధీనగర్ 1992 బ్యాచ్





**కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** 03/08/2025 – ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం నాడు భారతదేశంలో స్నేహితుల దినోత్సవం జరుపుకుంటారు.

త్వమేవ మాతా చ పితా త్వమేవ
త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ
త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ
త్వమేవ సర్వం మమ దేవదేవ
కృష్ణ – కుచేల స్నేహం

పరమాత్మ అనుగ్రహాన్ని పొందడానికి చూపించే నవవిధ భక్తుల (శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం లేదా స్నేహం, ఆత్మనివేదనం)లో స్నేహభక్తి ఒకటి. భగవంతునితో స్నేహం చేసి, దానితో సమానంగా భక్తిని ప్రదర్శించగలగడం అందరివల్లా అయ్యే పనికాదు. దీనిలో అద్భుత విజయం సాధించిన ఏకైక పౌరాణిక పురుషోత్తముడు కుచేలుడు. 'కృష్ణ–కుచేల స్నేహం' లోకానికే ఆదర్శం. స్నేహానికి 'పేద–ధనిక భేదం' లేదని ఈ కథ చాటుతున్నది. కృష్ణ–కుచేలుల స్నేహం ఎంత ప్రాణప్రదమో అంత పవిత్రం. అది విడదీయరానిది. వారి నడుమ స్వార్థానికి తావుండదు. అడిగిన తర్వాతే ఇచ్చేవారు సామాన్యులు. అడక్కుండా ఇచ్చేవారు గొప్పవారు. కృష్ణుడిది అంతటి గొప్పస్నేహం. కుచేలుని నిర్మల మనసు తెలిసిన నేస్తం ఆ పరంధాముడు. సాందీప మహర్షివద్ద బాల్యమిత్రులుగా విద్య నేర్చుకొని గురువుకు గొప్పపేరు తేవడమే కాక స్నేహానికి వన్నె తెచ్చారు కృష్ణ–కుచేలులు. కుచేలుని అసలు పేరు సుధామ. 'కుత్సితః చేలః కుచేలః'. ఆయన చినిగిన బట్టలు గలవాడు. కటిక పేదరికం. విద్య ముగిసాక గృహస్థుడైనాడు. గుణవతి, శీలవతి, అనుకూలవతి అయిన భార్య లభించింది. సంతానానికి కొదువ లేదు. కానీ, దరిద్రానికి ఆకలెక్కువ కదా! అంత పెద్ద కుటుంబాన్ని పోషించుకోలేని దుర్భర పరిస్థితి. కాలం ఎంత పరీక్ష పెట్టినా గోవింద నామస్మరణను మాత్రం కుచేలుడు మానలేదు. ఒకానొక సంక్లిష్ట పరిస్థితిలో కుచేలునితో భార్య, 'మీ బాల్యమిత్రుడైన శ్రీకృష్ణుని దర్శనానికి వెళ్లండి' అని ప్రాధేయపూర్వకంగా సూచిస్తుంది. 'అప్పుడు మన దారిద్ర్యం తొలగే మార్గం లభించవచ్చు' అన్నది ఎంతో ఆశగా. కుచేలుడూ 'చిన్ననాటి మిత్రుణ్ణి కంటినిండా చూసుకోవచ్చన్న' ఆనందంతో భార్య మాటను కాదనలేకపోయాడు. తక్షణమే కొన్ని అటుకులు భర్త కండువా కొసకు కట్టిచ్చింది. కృష్ణ నామస్మరణతోనే కృష్ణుని భవనంలోకి ప్రవేశిస్తాడు. 'ద్వారపాలకులు తనను లోపలకు వెళ్లనిస్తారో లేదోనని' అనుమాన పడుతుండగా, అనుకొన్నంతా జరిగింది. అక్కడి వారు అడ్డుకొన్నారు. ఎలా తెలిసిందో ఏమో స్వయంగా కృష్ణుడే అక్కడకు వచ్చి, స్వయంగా కుచేలుణ్ణి తోడ్కొని వెళతాడు. తన్మయత్వంతో కౌగిలించుకొంటాడు. తన మృదుతల్పంపై కూర్చోపెట్టుకొంటాడు. రుక్మిణీ సమేతంగా బాల్యమిత్రుడైన ఆ నిరుపేద బ్రాహ్మణునికి అర్ఘ్య పాద్యాలతో కాళ్లు కడుగుతాడు. 'నమోస్తనంతాయ సహస్రమూర్తయే సహస్ర పాదాక్షి శిరోరు బాహవే' అంటూ ఆ నీటిని కృష్ణ దంపతులిద్దరూ తమ శిరస్సులపై చల్లుకొంటారు. అతిథి పూజ చేస్తారు.షడ్రసోపేతమైన భోజనం వడ్డిస్తారు. కృష్ణుడిని చూసిన ఆనందంలో కుచేలుడు వచ్చిన పనినేమరిచి పోతాడు. తనపట్ల చూపుతున్న ఆదరణకు ఉబ్బితబ్బిబ్బవుతాడు. నోట మాటలు రానంత తన్మయత్వంలో మునిగిపోతాడు. స్నేహభక్తిలో పరాకాష్ట తప్ప మరేదీ కోరుకోని నిష్కామయోగి కుచేలుడు. నోరు తెరచి ఏమీ అడగకున్నా, అన్నీ తెలిసిన పరంధాముడు మిత్రునికి ఎంత వైభవం ఇవ్వాలో అంతా ఇచ్చాడు. కుచేలుడు ఇల్లు చేరేసరికి అతని పూరిగుడిసె స్థానంలో పెద్ద భవనమే వెలసింది.

**స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు.**
**మున్సిపల్ హైస్కూల్ గాంధీనగర్. కడప**

# 'క్రెడాయ్' సామాజిక బాధ్యత అభినందనీయం

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

## గడియారం ఆసుపత్రి నిర్వహణ క్రెడాయ్‌కి అప్పగింత

## ఎంవోయూపై కమిషనర్, క్రెడాయ్ ప్రతినిధుల సంతకాలు



**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 3 :** ప్రముఖ రియల్ ఎస్టేట్ రంగ సంస్థ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) సామాజిక బాధ్యతగా చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కొనియాడారు. ఆదివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో పాతబస్తీలోని గడియారం ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలను క్రెడాయ్ సంస్థకు బదలాయింపునకు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేశారు. కమిషనర్, క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ గోరంట్ల రమణ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పాతబస్తీలో దశాబ్దాల చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు స్వచ్ఛందంగా, సామాజిక బాధ్యతగా క్రెడాయ్ సంస్థ ముందుకొచ్చిందన్నారు. రాబోయే పదేళ్ళ పాటు నిర్వహణ బాధ్యతలను అప్పగించామని, శనివారం ఈ తీర్మానానికి పాలకవర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఈ పరిణామం వల్ల గడియారం ఆసుపత్రి సమీప ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, గడియారం ఆసుపత్రి అభివృద్ధి కోసం క్రెడాయ్ సంస్థకు కార్పొరేషన్ తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. క్రెడాయ్ సంస్థ జిల్లా చైర్మన్ గోరంట్ల రమణ మాట్లాడుతూ.. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ సూచనల మేరకే గడియారం ఆసుపత్రిని పదేళ్ల పాటు దత్తత తీసుకోవడం జరుగుతుందన్నారు. తొలుత రూ.20 లక్షలతో ఆధునికీకరణ పనులు చేపడతామని, మంత్రి, అధికారుల సహకారంతో ఆసుపత్రిలో వైద్య సిబ్బంది పెంపునకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే ఆసుపత్రి ఆధునికీకరణ పనులకు ప్రణాళికలు రూపొందించామని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ క్రిష్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ మంజూర్ బాష, క్రెడాయ్ సంస్థ సభ్యులు జి.సాయిరాం రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, గోవర్ధన్, ప్రకాష్, రంగనాథ్ రెడ్డి, డాక్టర్ గోపికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# అహుడా లేఔట్లను తనిఖీ చేసిన ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 02 :** కూడేరు మండల కేంద్రంలోని అహుడా లేఔట్ ను మరియు బ్రాహ్మణపల్లి గ్రామం వద్దనున్న అహుడా లేఔట్ ను శనివారం ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అహుడా లేఔట్ లలో మౌలిక సదుపాయాల కల్పన గురించి ఇంచార్జి జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. కూడేరు మండల కేంద్రంలోని అహుడా లేఔట్ చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు పూర్తి చేయాలని, లేఔట్ వద్ద ఇది అహుడా లేఔట్ అన్న శాశ్వత హోర్డింగ్ ను ఏర్పాటు చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బ్రాహ్మణపల్లి అహుడా లేఔట్ లో మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి స్థాయిలో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ మహబూబ్ భాష, అహుడ ఈఈ దుష్యంత్, డిఈ రేవంత్, రీసర్వే డిటీ ప్రసాద్, వీఆర్వో రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల లోని తుంబుర తీర్థం ను సందర్శించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, బృందం..

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణ డయల్ యువర్ కలెక్టర్

**వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిఆర్వో కోరారు.

**సభాభవన్ లో పిజిఆర్ఎస్ నిర్వహణ :** ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం సభాభవన్ లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు

**డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం :** డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు.ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## గవర్నర్‌ను కలిసిన చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు పెన్ పవర్ ఆగస్టు 3 :** కర్ణాటక రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ బెంగళూరు నుండి రోడ్డు మార్గంలో బయలుదేరి ఈరోజు చిత్తూరు ఆర్ అండ్ బి అతిథి గృహమునందు నాలుగున్నర గంటలకు విశ్రాంతి తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గం ద్వారా తిరుపతి బయలుదేరి వెళ్లారు.

# ఒక్క ఆకు.. ఒకే ఒక్క ఆకు..

## రోజూ పరగడుపున తిన్నారంటే ఆ సమస్యలే ఉండవు..



**కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** 1.ఛాతీలో కఫం, ఊపిరితిత్తుల సమస్యలు, ఆస్తమా బాధితులకు తమలపాకు అద్భుతమైన నివారణ. ఇందు కోసం తమల ఆకుపై కొద్దిగా ఆవాల నూనె రాసి, వేడి చేసి ఛాతీపై ఉంచితే రద్దీ తగ్గుతుంది. మీరు కొన్ని ఆకులను నీటిలో ఉడకబెట్టవచ్చు, రెండు కప్పుల నీటిలో ఏలకులు, లవంగాల, దాల్చినచెక్క వేసి నీరు సగానికి తగ్గేవరకు మరిగించాలి. ఆపై ఈ ద్రావణాన్ని రోజుకు రెండు, మూడుసార్లు తీసుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు చెప్పారు.

2.తమలపాకులు నొప్పిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పాన్ ఆకుల పేస్ట్‌ను గాయాలపై రాస్తే వెంటనే పెయిన్ నుంచి ఉపశమనం లభిస్తుంది. తమలపాకుల రసం తాగడం వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. చర్మ సంబంధిత సమస్యలు ఉన్నవారికి తమలపాకులు అద్భుతాలు చేస్తాయి. ఎందుకంటే ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి.

3.భోజనం చేసిన తర్వాత తమలపాకు నమలడం వల్ల మీ జీర్ణక్రియతోపాటు రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. ఇందులో ఉండే విటమిన్లు, పోషకాలు ప్రేగులను క్లీన్ చేస్తాయి. పాన్ ఆకులు నమలడం వల్ల మీ నోటి దుర్వాసన దూరమవుతుంది. అంతేకాదు.. దంతాల్లో క్యావిటీస్, దంతక్షయాన్ని అరికట్టి నోటిని ఆరోగ్యంగా ఉంచుతుంది.

4.జంక్ ఫుడ్ , ఫాస్ట్ ఫుడ్ , ఆయిల్ ఫుడ్ వంటివి తీసుకోవడం వల్ల కడుపులో కలిగే ఇబ్బందిని తమలపాకు దూరం చేస్తుంది. తమలపాకు నమలడం వల్ల అజీర్ణం, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది. అంతేకాదు.. తమలపాకుని సాధారణంగా మౌత్ ఫ్రెషనర్‌గా పరిగణిస్తారు. తమలపాకులు నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. ఇందులోని యాంటీ మైక్రోబియల్ లక్షణాలు మీ నోటి దుర్వాసనను తొలగిస్తాయి.

5.శ్వాస సమస్యలు ఉన్నవారు తమలపాకులతో పాటు లవంగాలను నీళ్లలో వేసి బాగా మరిగించి తాగాలి. దీని వల్ల చాలా వరకు ఉపశమనం పొందుతారు. అలాగే, గుండె జబ్బులతో బాధపడే వారికి కూడా తమలపాకు ఎంతో మేలు చేస్తుంది. తమలపాకు రసం తాగడం వల్ల గుండె జబ్బులకు మేలు చేస్తుంది. తమలపాకులు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి.

## స్నేహం ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# స్నేహితుల దినోత్సవ సందర్భంగా బీద విద్యార్థులకు సహాయం








**కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** కడప కడప జిల్లా కమలాపురం తాలూకా నగరానికి చెందిన ప్రధానోపాధ్యాయులు అయిన తండ్రి వెంకటేష్ హెడ్మాస్టర్, తల్లి కూడా హెడ్ మిస్సెస్ లక్ష్మీ నరసమ్మ ఇరువురు ఉపాధ్యాయ వృత్తి. వారి స్ఫూర్తితో నిత్యము బీద విద్యార్థులకు సహాయం చేసే తల్లిదండ్రులను స్ఫూర్తిగా తీసుకుని వారి సుపుత్రిక అయిన లక్ష్మీ ప్రసన్న 2017 సంవత్సరంలో భర్త సహృదయ భాస్కర్ సహకారంతో స్నేహం ఫౌండేషన్ స్థాపించి 477 ప్రోగ్రామ్స్ వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. అందులో కన్నీటి పర్యంతం జరిగిన రెండు సంవత్సరాల చిన్నారి పాపకు క్యాన్సర్ చికిత్సకు ఎటు తిరిగి పాపను బ్రతికించాలని తపనతో భర్త భాస్కర్ సహకారంతో స్నేహం ఫౌండేషన్ తరపున దాదాపు రెండు లక్షలు హాస్పిటల్ లో హెచ్చించిన చివరికి పాప రెండు సంవత్సరాల తర్వాత శివైక్యం చెందడం కలిసివేసిందని, అప్పటినుండి పేద బడుగు వర్గాల చిన్నారి పిల్లలకు అన్ని తానై ఓ పక్క ఉద్యోగ బాధ్యతలు కడప జిల్లా కేంద్ర కారాగారం నిర్వర్తిస్తూ, ఓ పక్క కుటుంబ బాధ్యతలు, భాస్కర్ కూడా ఉద్యోగరీత్యా ఎంత బిజీ లో ఉన్న లక్ష్మీ ప్రసన్నకు పూర్తి అండదండలు. ఉద్యోగ బాధ్యతలు , సంపాదించే సంపాదనలో కార్యక్రమాలు చేస్తూ జిల్లా స్థాయి నుండి, రాష్ట్రస్థాయి, జాతీయ జాతీయ స్థాయిలలో వందలకు పైగా అవార్డులు తీసుకోవడం జరిగినది. అనాధ పిల్లలకు అన్ని తానై పిల్లలకు అండగా, పుస్తకాలు, బట్టలు, దుప్పట్లు, అనేక స్వచ్ఛంద సేవా సంస్థలకు పూర్తి సహకారాలు, కరోనా కష్టకాలాలలో దగ్గరుండి వారికి అన్న పానీయాలు, కడప నగరం అనేక మెడికల్ క్యాంపులు, చేతనైనంత పదవ తరగతి విద్యార్థులకు 250 మందికి ఎగ్జామినేషన్ ప్యాడ్స్, జామెంట్రీ బాక్స్, పాఠ్యపుస్తకాలు, అవసరమైతే కొంతమందికి పూర్తి సహకారము, బాధ్యతలు కూడా తీసుకుంటున్నట్టు, లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు.

చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ లక్ష్మి ప్రసన్న సేవా కార్యక్రమాలలో పూర్తి సహకారం, వస్తురూపేనా, ద్రవ్యరూపమైన నా వంతు సహకారం అందిస్తున్నానని, ఇటువంటి సేవ కార్యక్రమాలలో పాల్గొన్నందుకు నాకు కూడా గర్వకారణంగా, ముక్తి హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నేషనల్ అవార్డుకు ఎంపిక కావడం గర్వంగా ఉన్నదని, ఈ అవార్డు హ్యూమన్ రైట్స్ డే రోజు అందుకో పోతున్నదని ఎంతో సంతోషంగా ఉన్నదని,అలాగే నా పూర్తి సహకారం, మా అత్తమామల సహకారము, తోటి ఉద్యోగుల సహకారం, స్నేహితుల సహకారము, అన్నిటికంటే ముఖ్యంగా తోటి స్వచ్ఛంద సేవా సంస్థలు పూర్తి సహకారం ఉన్నదని తెలియజేశారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ కడుపునిండా పిల్లలకు అన్నం పెడితే, తనకు తనవి తీరా తృప్తి ఉంటుందని, అందుకే ఎక్కువగా చిన్నారి పిల్లలు, అనాధ పిల్లలు, వృద్ధులు, వికలాంగుల సేవా సంస్థకు, నా యొక్క పూర్తి సహకారం, అలాగే ఇటీవలే జిల్లాలో పూర్తిగా సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు అనే అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు, ఆమె తెలియజేశారు.

స్నేహం ఫౌండేషన్ తన స్నేహితురాలు పద్మకు చిహ్నముగా ప్రారంభించానని, అంతేకాదు నా యొక్క భర్త భాస్కర్ సహకారంతో, ముఖ్యంగా తల్లిదండ్రుల స్ఫూర్తితో, మరియు వారి సహకారంతో, విజయము గా 2017 నుండి ఇప్పటివరకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని ఆమె తెలియజేశారు.





















# మానవులమన్న గుర్తింపును ఏది ఇస్తుంది?

## ఆకర్షణీయమైన రూపమా లేక సంస్కారయుక్తమైన భాషా? ఆలోచించండి : సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి స్నేహితుల బృందం



**కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** అందంలో ఔదార్యం.. ఒక అందమైన మహిళ విమానంలోకి ఎక్కి, తన సీటు కోసం వెతకడం ప్రారంభించింది. తన సీటు ఒక దివ్యాంగుడు ప్రక్కన ఉండడం చూసింది. ఆ దివ్యాంగునికి చేతులు లేవు. అతని ప్రక్కన కూర్చోవడానికి ఆ మహిళ సంకోచించింది. ఆ అందమైన మహిళ, “ఈ సీటులో నేను హాయిగా ప్రయాణం చేయలేను.. నా పక్కన కూర్చున్న వ్యక్తికి రెండు చేతులూ లేవు”, అంటూ తన సీటు మార్చాల్సిందిగా ఎయిర్ హెూస్టెస్ ను అభ్యర్థించింది. మహిళ ప్రవర్తనకు ఎయిర్ హెూస్టెస్ చాలా ఆశ్చర్యపోయింది. ఆమె తడబడుతూ, “మేడమ్, కారణం చెప్పగలరా?” అని అడిగింది.

“అలాంటి వాళ్లంటే నాకు ఇష్టం ఉండదు.. వాళ్లతో కలిసి ప్రయాణం చేయలేను’, అని ఆ మహిళ బదులిచ్చింది. చదువుకున్నట్లుగా, మర్యాదగా కనిపించే ఒక మహిళ నుండి ఇది విన్న ఎయిర్ హెూస్టెస్ కు చాలా ఆశ్చర్యం కలిగింది. “ఆ సీటులో నేను కూర్చోలేను, అందుకే నాకు మరో సీటు ఇవ్వండి”, అంటూ ఎయిర్ హెూస్టెస్ ని ఆ మహిళ పట్టుబట్టింది. ఎయిర్ హెూస్టెస్ ఖాళీ సీటు కోసం చుట్టూ చూసింది, కానీ ఆమెకు ఖాళీ సీటు ఎక్కడా దొరకలేదు. ఎయిర్ హెూస్టెస్ ఆ మహిళతో, “మేడమ్, ఈ ఎకానమీ క్లాస్ లో ఏ సీటు ఖాళీ లేదు, కానీ ప్రయాణీకుల సౌకర్యాన్ని చూసుకోవడం మా బాధ్యత, కాబట్టి నేను విమానం కెప్టెన్ తో మాట్లాడతాను, అప్పటి వరకు మీరు దయచేసి ఓపికపట్టండి. దయచేసి ఏదైనా త్రాగండి.” అంటూ కెప్టెన్‌తో మాట్లాడేందుకు ఎయిర్ హెూస్టెస్ వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత, ఎయిర్ హెూస్టెస్ తిరిగి వచ్చి ఆ మహిళతో, “మేడమ్! మీకు కలిగిన అసౌకర్యానికి క్షమించండి. ఈ మొత్తం విమానంలో, ఒక సీటు మాత్రమే ఖాళీగా ఉంది. కానీ అది ఫస్ట్ క్లాస్ లో ఉంది. నేను మా బృందంతో మాట్లాడాను. మేమంతా కలసి ఒక అసాధారణ నిర్ణయం తీసుకున్నాం. మా కంపెనీ చరిత్రలో మొదటిసారిగా, ఒక ప్రయాణికుడిని ఎకానమీ క్లాస్ నుండి ఫస్ట్ క్లాస్ కి తరలించడం జరుగుతుంది.” ఆ మహిళ ఆనందానికి అవధులు లేకుండాపోయింది, కానీ ఆమె ఏమీ అనకముందే, ఎయిర్ హెూస్టెస్ ఆ దివ్యాంగుని వద్దకు వెళ్లి, మర్యాదగా ఇలా అడిగింది, “సార్, దయచేసి మాతో ఫస్ట్ క్లాస్ కి రండి. ఒక మర్యాదలేని ప్రయాణీకునితో ప్రయాణించటం వల్ల మీరు బాధపడటం మాకు ఇష్టం లేదు”. ఇది విన్న ప్రయాణికులంతా చప్పట్లు కొడుతూ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. అందమైన ఆ స్త్రీ కళ్ళెత్తి ఎవరి వైపు చూడలేకపోయింది. ఆ దివ్యాంగుడు లేచి నిలబడి ఇలా అన్నాడు, “నేను మాజీ సైనికుడిని. రెస్క్యూ ఆపరేషన్ సమయంలో బాంబు పేలుడులో నా రెండు చేతులను పోగొట్టుకున్నాను. మొదట, ఈ స్త్రీ మాటలు విన్నప్పుడు, నేను నా ప్రాణాలను పణంగా పెట్టి, నా చేతులు కోల్పోయినది ఎవరి భద్రత కోసమని నేను ఆలోచిస్తూ ఉండిపోయాను. కానీ ఇప్పుడు మీరందరూ ఎయిర్ క్రాఫ్ట్ కెప్టెన్ నిర్ణయానికి సంతోషంగా స్పందిస్తున్నప్పుడు, నా దేశం, దాని ప్రజల కోసం నా రెండు చేతులను కోల్పోయినందుకు ఇప్పుడు నేను గర్వపడుతున్నాను”, ఇలా చెప్పి ఎయిర్ హెూస్టెస్ తో కలిసి అతను ఫస్ట్ క్లాస్ వైపుకి వెళ్లాడు.










అందమైన ఆ మహిళ సిగ్గుతో తలదించుకుంది..

ఆలోచనలో ఔదార్యం లేని, అలాంటి అందానికి విలువ ఉండదు.

వ్యక్తులను విమర్శించకుండా ఉండగలగడం అనేది మనలో చాలా మందికి చాలా కష్టమైన పని, ఎందుకంటే వారి పరిస్థితుల గురించి ఏమీ తెలియకుండా వారి గురించి ఊహించడం లేదా అభిప్రాయాలను ఏర్పరచుకోవడం మానవ స్వభావం. ఎవరైనా మనల్ని అంచనా వేసినప్పుడు, మనకు కోపం వస్తుంది. మనపై ఆ అభిప్రాయానికి దారితీసిన పరిస్థితులను సమర్థించుకోవడానికి ప్రయత్నిస్తాం.

హృదయ ఆధారిత ధ్యానం యొక్క సాధన మన మానవ బలహీనతలను అధిగమించడానికి సహాయపడుతుంది. ఆ ఫలితాలను మీరే స్వయంగా అనుభవించవచ్చు. అందరినీ సమానంగా ఆదరించండి, అలాగే అందరితో ఒకేవిధంగా ప్రవర్తించండి.

**బాబూజీజి**

**సేకరణ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

# గురువుతోనే గమ్యం సాధ్యం...

## బి.లక్ష్మీ ప్రసన్న స్నేహం ఫౌండేషన్



**కడప పెన్ పవర్ ఆగస్టు 3 :** డబ్బు, పేరు, పదవులు ఇవన్నీ అర్థాలు మాత్రమే..... పరమార్థాన్ని తెలుసుకోవడానికి, జీవన గమ్యంని చేర్చగలిగేవాడు ‘గురువు’ మాత్రమే అని చెప్పే కథ ఇది. ఓ మహానగరంలో ఓ గురువుగారు తన వద్దకు వచ్చేవారికి ఆధ్మాత్మిక శిక్షణ ఇస్తూ, ధర్మప్రబోధం చేస్తుండేవారు. మహా సంపన్నుడొకడు ఈ గురువుగారి దగ్గరకు వచ్చి. అసలు గురువు అవసరమా? గురువు లేకుంటే వచ్చిన నష్టమేమిటి? అని ప్రశ్నించాడు. గురువుగారు నవ్వుకుని, మీరేం చేస్తుంటారని అడిగారు.నాకు అతిపెద్ద సూపర్ బజార్ ఉంది అని సమాధానమిచ్చాడు సంపన్నుడు.అయితే! ఒకసారి మీ సూపర్ బజార్ కు నన్ను తీసుకువెళ్లండని గురువుగారు అడిగారు.ఇద్దరూ కలిసి సూపర్ బజార్ కు వెళ్లారు. ఆ రోజు సెలవు కావడంతో నిర్మానుష్యంగా ఉంది. ఏడంతస్థుల పెద్ద భవంతి. అందులో దొరకనిదంటూ ఉండదు. దానిని చూసిన గురువుగారు నవ్వుకున్నారు.

అక్కడే ఈ సంపన్నుడు ఆవులను, కుక్కలను పెంచుతున్నాడు. ఆ మందలోంచి ఒక ఆవును సూపర్ బజార్ లోపలికి వదలవలసిందిగా గురువుగారు కోరారు. కోరినట్లుగానే ఆవును లోపలికి ప్రవేశపెట్టారు. అది అన్నీ తిరుగుతూ, తిరుగుతూ చివరకు ఒక మూల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉన్న పండ్ల దుకాణంలోకి వెళ్లింది. కడుపునిండా , తృప్తిగా మేసింది. రెండుగంటల వ్యవధిలో తిరిగి వచ్చేసింది. దుపరి తను పెంచుతున్న కుక్కను లోపలికి వదలమని కోరారు గురువుగారు. దానిని కూడా లోపలికి పంపారు. అది కూడా తిరుగుతూ, తిరుగుతూ వాసన చూస్తూ, మూడవ అంతస్థులో మాంసం అమ్మే దుకాణంలోకి వెళ్లింది. తృప్తిగా తినేసింది. మూడు గంటల వ్యవధిలో అది కూడా తోక ఊపుకుంటూ యజమాని దగ్గరకు వచ్చేసింది. ఈసారి ఒక సామాన్యుడిని పిలిచి, నీకు నచ్చినన దానిని తీసుకో అని చెప్పి పంపారు గురువు. ఉత్సాహంతో లోపలికి ప్రవేశించిన మనిషి అన్నింటినీ చూసి, ఉక్కిరిబిక్కిరైపోయాడు. ఏం తీసుకోవాలో అర్థం కావటం లేదు.రెండు, మూడు, నాలుగు గంటలు గడిచిపోయినా బయటకు రావడం లేదు. అందరూ ఆశ్చర్యపోయారు. గురువుగారు యజమానిని కలిసి అతడున్న చోటకి చేరుకున్నాడు. నెత్తిమీద చేతులు పెట్టుకుని దిక్కులు చూస్తున్న ఆ వ్యక్తికి ఏం కావాలో అర్థం కావడం లేదు. ఈ వస్తులన్నింటినీ చూస్తుంటే పిచ్చెత్తిపోతోంది అన్నాడు ఆ వ్యక్తి. దీనిని విన్న సంపన్నుడు అవాక్కయ్యాడు. ఆవుకీ, కుక్కకీ పిచ్చెక్కలేదు. వాటికి ఏం కావాలో వెతుక్కుని తృప్తిగా ఆరగించి వచ్చాయి. మనిషి మాత్రం ఏం కావాలో తనకే తెలియదు. తనకే అన్ని తెలుసనుకుంటాడు. పాపం! అందుకే వీడికి గురువు కావాలి. ఎలా జీవించాలో జీవిత ఔన్నత్యాన్ని ఎలా పొందాలో తెలుసుకోవాలి. అందుకే వాటిని తెలియజెప్పే గురువు అత్యంత అవసరమని గురువుగారు చెప్పడంతో యజమానికి ధనగర్వం తొలగింది. గురువుతోనే గమ్యం సాధ్యమని తెలుసుకున్నాడు.

## శ్రీ కోదండరామస్వామివారికి

# బంగారు తులసి హారం బహుకరణ





**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 3 :** తిరుపతి శ్రీ కోదండరామస్వామివారికి శనివారం సాయంత్రం బెంగళూరుకు చెందిన దాత బంగారు తులసి హారం బహుకరించారు. రూ.26 లక్షల విలువైన 257 గ్రాముల బంగారు తులసి దళాలపై గాయత్రి బీజాక్షరాలు చెక్కబడిన హారంను దాత ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్నకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ఆనంద కుమార్ దీక్షితులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ సురేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నేడే గొప్ప ప్రారంభం...

## తారాస్ కేఫ్ స్టోరీస్ ... మన కడపలో






భరతమాత ముద్దుబిడ్డ...
భారత దేశ ప్రధాని...
నరేంద్ర మోడీజీ..
నోబెల్ శాంతి బహుమతికి..
100% అర్హుడే...
జై భారత్ మాతా...
జయహెూ భారత్ మాత...

# నేడు జీకే వీధి మండల కేంద్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం

- ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 3:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో నేడు (ఆగస్టు 4, సోమవారం) ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం జరగనుంది.ఈ సమావేశంలో భాగంగా ముందుగా వీధి లైట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం “బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ” అనే అంశంపై మండల స్థాయి సమావేశం జరుగుతుంది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాడేరు శాసన సభ్యులు, అల్లూరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు హాజరవుతారు. మండల స్థాయిలోని కీలక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సమక్షంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై, పార్టీ బలోపేతంపై చర్చ జరగనుంది.సమావేశాన్ని విజయవంతం చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని పార్టీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీ లోతా దేముడు ఈ కార్యక్రమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పార్టీ ఉపాధ్యక్షులు వంతల అరుణ్ కుమార్, రీమేల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులు వంతల చంటిబాబు, పాంగి చందర్ రావు, షేక్ దావీదు, నారాయణ, రామూర్తి తదితరులు సమావేశ ఏర్పాట్ల పర్యవేక్షణ చేస్తున్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని ఎంపీపీ,



జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర-జిల్లా నాయకులు, నూతనంగా నియమితులైన మండల కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అన్నదాతలకు అండగా పీఎం కిసాన్ సన్మాన్ నిధి

- రైతుల ఖాతాల్లో రూ.2000 జమ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగష్టు 3:**దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరణలో ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ సన్మాన్ నిధి పథకం ద్వారా రైతులకు కేంద్ర ప్రభుత్వం 20వ విడత పెట్టుబడి ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. ఈ పథకం కింద రూ. 2000 మంజూరై, రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమైంది.ఈ పథకం ద్వారా సంవత్సరానికి రూ.6000 మూడు విడతలుగా రైతులకు అందిస్తూ, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగించుకునేలా ప్రభుత్వం చేపట్టిన ఈ ముందడుగు ఎంతో అవసరమైనదిగా భావిస్తున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా అదనంగా రూ.5000 చొప్పున ఇవ్వడంతో రైతులకు ఈసారి మొత్తం రూ.7000 లాభం చేకూరనుంది.వ్యవసాయం చేసుకునే ప్రతి రైతు ఈ పథకం ప్రయోజనాన్ని పొందుతూ, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దుర్వినియోగం జరగకుండా చూసుకోవాలని గూడెం కొత్తవీధి మండలం బీజేపీ మండల అధ్యక్షులు కాకూరు శేఖర్ పిలుపునిచ్చారు.రైతన్నల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తాయని, పీఎం కిసాన్ నిధి పథకం అన్నదాతల సురక్షకు నిలువుదల అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## నేడు జీ.కే.వీధిలో ఆదివాసి దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం

- నేడు ఉదయం 11 గంటలకు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగష్టు 3:** ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా, ఈ నెల 9 ఆగస్టు 2025న నిర్వహించబోయే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు, ఈ రోజు (04-08-2025, సోమవారం) ఉదయం 11 గంటలకు, జీ.కే.వీధి మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయబడింది.ఈ సమావేశానికి మండలంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు, పీసా కమిటీ సభ్యులు, మోటార్ యూనియన్ నేతలు, వర్తక వాణిజ్య ప్రతినిధులు, కార్మిక కర్షక మిత్రులు, మహిళలు, యువత అందరూ తప్పక హాజరై, ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని ఘనవంతంగా చేయాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం, జీ.కే.వీధి మండలం వారు కోరుతున్నారు.అందరి సమన్వయంతో జరిగే ఈ సమావేశం గిరిజనుల సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యాన్ని చాటేలా ఉండనుంది. అందుకే ప్రతి ఒక్కరు తమ పాత్రను నిర్వర్తిస్తూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీ నిధుల విడుదల కోసం చలో విజయవాడ

- ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల భారీ నిరసన
- రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు కుందేరి రామకృష్ణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 3:**కేంద్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో 15వ ఆర్థిక సంఘం కింద రాష్ట్రానికి విడుదల చేసిన 1,121 కోట్ల నిధులను ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సర్పంచులు ఆగస్టు 5వ తేదీన “చలో విజయవాడ” కార్యక్రమం నిర్వహించనున్నారని రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు దామనాపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ తెలిపారు.“గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలి. సర్పంచులకు గౌరవ వేతనం పెంచాలి. ఉపాధి హామీ పథకం పనులను పంచాయతీల ద్వారానే నిర్వహించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి,” అని సర్పంచు పేర్కొన్నారు. సర్పంచులు తెలిపిన వివరాల ప్రకారం, నిధుల లభ్యత లేక పారిశుద్ధ్య పనులు, బ్లీచింగ్, కాలువల పూడికతీత వంటి పనులు నిలిచిపోయాయి. గ్రామ పంచాయతీ కార్మికులు జీతాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వారు వాపోయారు.ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ తక్షణం స్పందించి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, నిధుల జమపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఇంకా ఏమన్నా ఆలస్యం జరిగితే...
ఐదో తారీఖున జరిగే నిరసన అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని సర్పంచుల నేతలు హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల న్యాయమైన డిమాండ్లను అంగీకరించకపోతే, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## అప్పుడే పుట్టిన చిన్నారులకు ముర్రుపాలు పాలతోని సంపూర్ణ ఆరోగ్యం

కేజీహెచ్ సూపరిం టెండెంట్ ఐ. వాణీ



**విశాఖ దక్షిణం పెన్ పవర్ ఆగస్టు 3** :అప్పుడే పుట్టిన చిన్నారులకు ముర్రుపాలు పాలతోని సంపూర్ణ ఆరోగ్యమని కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ వాణీ అన్నారు. ఈమేరకు తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా ఐసిడిఎ స్,ఆరోగ్య శాఖ సాయుక్త ఆధ్వర్యంలో ఆది వారం ఉదయం ఆర్ కె బీచ్ కాళీమాత ఆల యం వద్ద పెద్ద ఎత్తున అంగన్వాడీ లు ప్లకార్డ్స్, బ్యానర్ లు ప్రదర్శిస్తూ “తల్లిపాలు ముద్దు - డబ్బాపాలు వద్దు” అనే నినాదంతో మానవ హారం నిర్వహించారు. కార్య క్రమానికి హాజరైన కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ వాణీ మాట్లాడా రు బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు తల్లిపాలు శిశువును న్యుమోనియా అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడ తాయని తెలిపారు పిల్లల మేధస్సును మెరుగు పరచడంలో తల్లి పాలు సహాయపడతాయ న్నారు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె వి రామలక్ష్మి మాట్లాడుతూ తల్లి పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రుపాలు) బిడ్డకు అమఅతంలాంటి వి అని వివరించారు తల్లి పాలు సంపూర్ణ ఆహారం అని అన్నారు వీటిలో బిడ్డకు అవస రమైన అన్ని పోషకాలు ఉంటాయనీ అలాగే వ్యాధి నిరోధక శక్తి కలు గుతుందని చెప్పారు.
ఈ కార్యక్రమంలో సిడీపీఓ లు కె నీలిమ,డి. నీల వేణి,ఎం.శ్రీదేవి,ఝాన్సీ రాణి, సంతోషి,శ్రీలత సెక్టార్,సూపర్ వైజర్ లు పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్కి ఘన స్వాగతం



- దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 3** :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల,ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పార్టీ %ూాజ% చైర్మన్, పెద్దలు నాదెండ్ల మనోహర్ కి విశాఖపట్నం విమానా శ్రయంలో జనసేన పార్టీ విశాఖ నగర అద్యక్షు లు , దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విశాఖ నగరానికి రాష్ట్ర మంత్రి విచ్చేసారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రూరల్ అధ్యక్షులు పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు ఎమ్మెల్యేలు విజయ్, మాధవి, వివిధ హెూదాల లో ఉన్న జనసేన పార్టీ శ్రేణులు ,వీర మహిళలు పాల్గొన్నారు.

## ఐఏఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన డిప్యూటీ తహసిల్దార్ దుమంతి సత్యనారాయణ

విద్య అనేది మార్గం- సేవే లక్ష్యం



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దొడ్డికొండ గ్రామంలో గల ఒక యువకుని భవిష్యత్తును వెలుగులోకి తీసుకువచ్చే ముఖ్యమైన సంఘటన ఆదివారం జరిగింది. గూడెం కొత్త వీధి మండల డిప్యూటీ తాహసిల్దార్ దుమంతి సత్యనారాయణ దొడ్డికొండ గ్రామానికి చెందిన వసుపరి దుర్గాప్రసాద్ కు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలకు అవసరమైన స్టడీ మెటీరియల్ ను పంపిణీ చేశారు. యువకుడు గూడెం కొత్తవీధి పెన్ పవర్ రిపోర్టర్ మాదిరి చంటిబాబు ను స్టడీ మెటీరియల్ కొరకు తెలపగా ఆయన డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు విషయం తెలియజేశారు. రిపోర్టర్ మాదిరి చంటిబాబు విజ్ఞాపన మేరకు దుమంతి సత్యనారాయణ స్వయంగా ముందుకు వచ్చి తన బావగారైన లొంజా బాలగంగాధర్ తిలక్, తన కుమారుడు దుమంతి భవాని ఓంకార్ సహకారంతో ఐఏఎస్ స్టడీ మెటీరియల్ ను దుర్గాప్రసాద్ కు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దుమంతి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యను నమ్ముకున్న వారు ఎప్పుడూ మోసపోలేరు. ఈ పుస్తకాలు నిన్ను ఉన్నత స్థాయిలో చేర్చుతాయి అని నమ్మకం ఉంది. నువ్వు భవిష్యత్తులో స్థిరపడిన తర్వాత ఈ సమాజానికి తిరిగి ఏదో ఒక రూపంలో సేవ చేయాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. విద్యను ఆశ్రయిస్తే జీవితంలో తిరిగే ఉండదని కష్టపడి చదివి భవిష్యత్తులో స్థిరపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాదిరి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం .





- విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు.
- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్.

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 03 :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాల యాలలోనూ “ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం” 2025 ఆగస్టు 4వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబ డునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరా వు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు.
నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి,దీపాలు, హారికల్చ ర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ఆగస్టు 4వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరా వు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

## 87వ వార్డ్ లో నూతనంగా వేసిన సీసీ రోడ్ ను పరిశీలన



**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 03**
జివియంసి 87వ వార్డు పరిధి వడ్లపూడిలో నూతనంగా వేసిన సీసీ రోడ్డును పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుందని ప్రజల ఆలోచనలకు తగ్గట్టు వారికి ఏ అభివృద్ధి కావాలో ఆ పనులు మాత్రమే చేయడం జరుగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాగి విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్, జన సైనికులు కర్రి నర్సింగరావు, తుట్టా పైడ్రాజు, సందర్ సునీల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు



**గాజువాక పెన్ పవర్, ఆగస్టు 03 :**వై సి పి క్యాంప్ ఆఫీస్ లో ప్రపంచ స్నేహితులు దినోత్సవం సందర్భంగా వై సి పి గాజువాక ముఖ్యనాయకులు ఆధ్వర్యంలో కేక్ కట్ సంబరాలు చేసికోవటం జరిగింది. అనంతరం ఫ్రండ్స్ షిప్ బెండ్స్ కట్టుకొని స్వీట్లు పంచుకోవటం జరిగింది అనంతరం నాయకులు మాట్లాడుతూ.

కుల మాత భేదం చూడనిది
పేద ధనిక బేధంలేనిది
బంధుత్వం కన్నా గొప్పది స్నేహం మనిషి కన్నా మనుసు మిన్న,ఆవేశం కన్నా ఆలోచన మిన్న,ప్రాణం కన్నా త్యాగం మిన్న కానీ అన్నిటి కన్నా ఎల్లా కాలం ఉండే మన స్నేహం మిన్న అని అన్నారు.

ఈ కార్యక్రమం లో గాజువాక ఎస్సి అధ్యక్షుడు మార్ధుపూడి పరదేశి,64 వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాస్ రెడ్డి,75 వ అధ్యక్షులు గోందేశీ శ్రీనివాస్ రెడ్డి,గోందేశీ వెంకటరమణ రెడ్డి సంపంగి ఈశ్వర్ రావు,పిట్టా రెడ్డి,ఎస్.రాజారావు,వాసా అప్పలరెడ్డి,ములకలపల్లి వెంకటేష్,మంగు నాయుడు.పిట్టా చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందికి సన్మానించిన కోడిసింగి గ్రామస్తులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 3:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం లక్కవరపేట పంచాయతీ సచివాలయంలో గత ఐదేళ్లుగా ప్రజలకు సేవలు అందించిన సచివాలయం సిబ్బందిని కోడిసింగి గ్రామంలో బోండ్ల చిరంజీవి, మచ్చల కళ్యాణ్, సుంకరి శ్రీను ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సచివాలయం ఉద్యోగులు సుర కత్తి రామ్, కోటి, నిర్మల, ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులం అయినా గ్రామస్తులతో మాకు ఏర్పడిన అనుబంధం కుటుంబ సంబంధాల మాదిరిగానే ఉంది. ఈ గ్రామం మా ఉద్యోగ జీవితానికి తొలిమెట్టు. ఇక్కడి ప్రజల ఆత్మీయత మమ్మల్ని మర్చిపోలేని అనుభూతుల్లో ముంచెత్తింది అని భావోద్వేగంగా పేర్కొన్నారు. బదిలీపై వెళుతున్న సమయంలో వారు కన్నీటి పర్యంతం అవటం భావోద్వేగాలకు గురిచేసింది. సిబ్బందికి జ్ఞాపకాలు అందజేసి, దుస్సాల్వలతో సన్మానించారు. ఇవాళ విడిపోవలసి రావటం బాధగా ఉన్న, వృత్తిరీత్యా తప్పదు కనుక భవిష్యత్తులో వృత్తిరీత్యా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ మరింత మంచి సర్వీస్ అందించాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామమునసాబు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక యువత, మహిళా సంఘాల నాయకులు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ ఫస్ట్ ఫిమేల్ బాడీగార్డ్.. అదానో కపేసా ఎవరు?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల ప్రధాని మోదీ యూకె పర్యటనలో లక్షలాది మందిని ఆకర్షించింది ఓ దృశ్యం..ఆ సీన్‌లో మోదీ వెనక ఓ మహిళ కనిపిస్తోంది. ఆమె ప్రధాని మోదీ పక్కన నిలబడి ఉన్న మహిళా బాడీగార్డ్. ఆమె పేరు అదానో కపేసా.. ఇప్పుడు ఈమె గురించే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఓ మహిళ అత్యంత కీలక బాధ్యతలో ఉండటాన్ని చూసి నెటిజన్లు ఆశ్చర్యంతో పాటు ప్రశంసలు కురిపించారు.

**ఎవరీ అదానో కపేసా.. ?**

అదానో కపేసా..ప్రధాని మోదీకి తొలి ఫిమేల్ బాడీగార్డ్. అత్యున్నత స్థాయి సెక్యూరిటీ ఫోర్స్ అయిన స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ లో ఈమె ఎలైట్ కమాండోగా పనిచేస్తున్నారు. ఈ బృందం ప్రధానమంత్రికి, ఆయన కుటుంబ సభ్యులకు భద్రత కల్పిస్తుంది. కఠినమైన శిక్షణ, సామర్థ్యం ఉన్నవారు మాత్రమే %శ్రా+%లో భాగం కాగలుగుతారు. అదానో కపేసా ఎంపిక భారత భద్రతా వ్యవస్థలో మహిళల పాత్రకు పెరుగుతున్న ప్రాముఖ్యతకు నిదర్శనంగా చెప్పొచ్చు.

అదానో కపేసా..మణిపూర్ కు చెందిన ఇన్ స్ట్రక్టర్. ప్రధాని మోదీ సెక్యూరిటీ టీంలో ఉన్న మణిపూర్ నుంచి తొలి మహిళ. అంతేకాదు.. దేశంలోనే బెస్ట్ సెక్యూరిటీ ఫోర్స్ లో మొదటి మహిళ రికార్డ్ సృష్టించింది. అదానో కపేసా..మొదట హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర సాయుధ పోలీసు దళం సశస్త్ర సీమా బల్ (%ూాదీ%)లో తన ప్రయాణాన్ని ప్రారంభించింది. ఆమె ఉత్తరాఖండ్ లోని పిథోర్ గడ్ లో 55వ బెటాలియన్ లో సేవలందిస్తోంది. %శ్రా+%లో ఆమె చేరిక దేశంలో భద్రత ,చట్ట అమలులో మహిళలు కీలక స్థానాల్లో అందిస్తున్న సేవలను సూచిస్తుంది.

# వామ్మో..ఇలా చనిపోతున్నారేంటీ.. జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుండగా గుండెపోటు.. బెంగాల్ యువక్రికెటర్ మృతి




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో గుండెపోటుతో మరణాలు ఎక్కువయ్యాయి. చిన్న పిల్లలనుంచి వృద్ధుల వరకు ప్రముఖుల నుంచి సాధారణ ప్రజల వరకు వయసుతో సంబంధం లేకుండా కార్డియాక్ అరెస్ట్ తో చనిపోతున్నారు.క్రికెట్ ఆడుతూ ఒకరు.. డ్యాన్స్ చేస్తూ ఒకరు.. కూర్చున్నవారు కూర్చున్నట్లు కూలిపోయిన సంఘటనలు మనం చూస్తున్నాం.. తాజాగా బెంగాల్ కు చెందిన యువ క్రికెటర్ కూడా గుండెపోటుతో మరణించడం ఆందోళన కలిగిస్తోంది. బెంగాల్ కు చెందిన యువ క్రికెటర్ ప్రియజిత్ జిమ్ సెషన్ లో గుండెపోటుతో మృతిచెందాడు. బెంగాల్ అండర్ 16 క్రికెట్ టోర్నమెంట్ లో అత్యధిక పరుగులు చేసిన 22 యేళ్ల ప్రియజిత్.. బెంగాల్ తరపున రంజీ ట్రోఫీలో ఆడాలని, జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని లక్ష్యంతో ఆడుతున్నాడు. క్రికెట్ లో అద్భుత ప్రతిభ కనబరస్తున్న క్రమంలో ప్రియజిత్ జీవిత ప్రయాణం అర్థంతరంగా ముగిసింది. శుక్రవారం(ఆగస్టు1) ఉదయం జిమ్ లో వర్కవుట్స్ చేస్తుండగా చెమటలు పట్టి ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో స్నేహితులు, బంధువులు,సహచరులు శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రియజిత్ అకాల మరణం బెంగాల్ క్రికెట్ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రియజిత్ ఘోష్‌కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున ఆడాలని, తరువాత భారత జట్టులోకి రావాలని కలలు కనేవారు. 2018-19 సీజన్‌లో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ నిర్వహించిన అండర్-16 ఇంటర్-డిస్ట్రిక్ట్ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసి గుర్తింపు పొందారు. యువక్రికెటర్ ప్రియజిత్ ఘోష్ ఆకస్మిక మరణం అలాగే ఇటీవల కాలంలో ఇలాంటి అనేక ఘటనలు యువకులలో గుండెపోటు పెరగడం పట్ల ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ మరణాలు అధిక వ్యాయామంతో గుండెపై పడే ఒత్తిడి, అప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు,ఇతర కారణాల వల్ల సంభవిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాయామం చేసే ముందు వైద్య సలహా తీసుకోవడం, శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వడం చాలా ముఖ్యం అని డాక్టర్లు సూచిస్తున్నారు.

# ఇంట్లోకి వరద వస్తే... గంగమ్మ వచ్చిందని పూజించిన పోలీస్ ఆఫీసర్..



**హైదరాబాద్ పెన్ పవర్:** మాములుగా ఇంట్లోకి వరద వచ్చిందంటే ఎంత కంగారు పోతాం..? ఇంట్లో సామాన్లన్నీ మునిగిపోయి, ఇల్లంతా వరద నీటితో నిండిపోయి పరిస్థితి గందరగోళంగా తయారవుతుంది. కానీ.. ఓ పోలీస్ ఆఫీసర్ మాత్రం ఇంట్లోకి వరద వస్తే.. గంగమ్మ తల్లి ఇంట్లోకి వచ్చిందని పూజలు చేశారు. యూపీలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో చంద్రదీప్ అనే పోలీస్ ఆఫీసర్ తన ఇంట్లోకి ప్రవేశించిన వరద నీటికి పూజలు చేశారు. పోలీస్ ఆఫీసర్ వరద నీటికి పాలు, పూలు అర్పించి పూజలు చేస్తున్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. యూపీ సహా ఉత్తర భారతదేశంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చాలా ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. ఈ క్రమంలో యూపీలోని ప్రయాగ్ రాజ్ లో చంద్రదీప్ అనే పోలీస్ ఆఫీసర్ ఇంట్లోకి వచ్చిన వరద నీటికి పూజ చేస్తున్న వీడియో ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు. వరద నీటిలో ఈత కొడుతూ జై గంగా మైయా కి అంటూ నినాదాలు చేస్తున్న వీడియో నెట్టింట వైరల్ గా మారింది.ఇవాళ ఉదయం డ్యూటీకి బయలుదేరుతుండగా గంగమ్మ తల్లి మా ఇంటికి వచ్చిందని.. ఇంటి గుమ్మం దగ్గర గంగా మాతను పూజించి ఆశీస్సులు పొందానని క్యాప్షన్ తో వీడియోను షేర్ చేశారు చంద్రదీప్. చంద్రదీప్ ఇన్‌స్టాగ్రామ్ బయో ప్రకారం, అతను యూపీ పోలీస్ స్విమ్మింగ్ ఛాంపియన్ అని తెలుస్తోంది. యూపీ పోలీస్ ఛాంపియన్ స్విమ్మర్, నేషనల్ స్విమ్మర్ అని తన బయో ద్వారా తెలుస్తోంది.

# ఫ్రెండ్ షిప్ డే సాక్షిగా ఘోరం.. బెస్ట్ ఫ్రెండ్ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

**హైదరాబాద్ పెన్ పవర్:** ములుగు మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన ఐకేపీ కంప్యూటర్?ఆపరేటర్?హత్య కేసును పోలీసులు చేధించారు. శనివారం సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ విజయకుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ములుగు గ్రామానికి చెందిన తీగుళ్ల నెహ్రూ (35), వర్గల్ మండలం మజీద్ పల్లి గ్రామానికి చెందిన గమిలిపురం మహేశ్ ఇద్దరూ స్నేహితులు. వీరి మధ్య తరచుగా చిట్?ఫండ్?డబ్బుల లావాదేవీలు జరిగేవి. ఈ క్రమంలో మహేశ్??కు కొండపాక సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో పీఈటీగా పనిచేస్తున్న నిషారాణితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఇటీవల చిట్?ఫండ్? కమిషన్?డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య విబేధాలు ఏర్పడడంతో మహేశ్?ఈ నెల 28న నిషారాణి వద్ద ఉన్న బంగారాన్ని మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ వర్గల్ బ్రాంచ్ వద్ద తాకట్టు పెట్టి రూ.58,600 రుణం తీసుకున్నాడు. ఆ డబ్బును అప్పులు కట్టడానికి వినియోగించుకున్నట్టు చెప్పినా ఆమె నమ్మలేదు. నెహ్రూను మధ్య వర్తిగా తీసుకురమ్మని చెప్పింది. ఈ క్రమంలో మహేశ్ అతడిని తీసుకొని నిషారాణి ఇంటికి వెళ్లగా అక్కడ నెహ్రూ ఆమె గురించి అసభ్యకరంగా మాట్లాడడంతో మహేశ్?కోపంతో అతడిపై దాడి చేశాడు.



ఇంట్లో ఉన్న వైర్?ను మెడకు చుట్టి చంపేశాడు. తర్వాత నిషారాణి తండ్రి కొమురయ్య సాయంతో డెడ్?బాడీని కారులో మద్దూరు మండలం గాగిల్లపూర్?లో ఉన్న పొలానికి తీసుకెళ్లి దాచిపెట్టారు. తర్వాత బాడీకి రాళ్లను కట్టి పెద్ద చెరువులో పడేశారు. అనంతరం ఉబ్బని వినయ్ ఫోన్ నుంచి నెహ్రూ భార్యకు ఫేక్ కాల్ చేసి అన్న రేపు వస్తాడని చెప్పాడు. మరునాడు మహేశ్ వెళ్లి అతడి భార్యకు రూ.15000 చిట్టి డబ్బులను ఇచ్చి

నెహ్రూ బాగానే ఉన్నట్లు నమ్మించడానికి ప్రయత్నించారు. మహేశ్?ఫోన్?ను కొండపోచమ్మ కెనాల్?లో పడేసి ట్రేస్?కాకుండా జాగ్రత్త పడ్డారు. ప్రధాన నిందితుడైన గమిలిపురం మహేశ్, సహా నిందితులు నిషా రాణి, ఉబ్బని వినయ్, నారదాసు కొమురయ్యను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మళ్లీ భూకంపం.. బద్దలైన అగ్నిపర్వతం.. సునామీ హెచ్చరికలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యాలో ప్రకృతి మరోసారి తన ప్రతాపాన్ని చూపించింది. ఆదివారం ఉదయం కురిల్ దీవుల ప్రాంతంలో 7.0 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. ఈ విషయం జపాన్ వాతావరణ శాఖ , యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే ద్వారా నిర్ధారించబడింది. భూకంపం తర్వాత రష్యా అత్యవసర సేవల మంత్రిత్వ శాఖ పలు తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది, దీంతో ఆయా ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

**భూకంపం ప్రభావం , కమ్చట్కాలో అగ్నిపర్వత విస్ఫోటనం**

భూకంపం ధాటికి పలు నగరాల్లో భవనాలు ఊగిపోవడంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇప్పటివరకు ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం గురించి ఎటువంటి సమాచారం లేదు, కానీ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ భూకంపం ప్రభావంతో, కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం శనివారం అర్ధరాత్రి బద్దలైంది. దాదాపు 600 సంవత్సరాల తర్వాత ఈ అగ్నిపర్వతం తిరిగి చురుకుగా మారింది. విస్ఫోటనం కారణంగా దాదాపు 6,000 మీటర్ల ఎత్తు వరకు బూడిద ఎగసిపడింది. ఇది అక్కడి వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదాన్ని సూచిస్తోంది.

**మరో అగ్నిపర్వతం కూడా చురుకుగా మారింది**

క్రాషెన్నినికోవ్ తో పాటు, అదే కమ్చట్కా ద్వీపకల్పంలో ఉన్న మరో అత్యంత చురుకైన అగ్నిపర్వతం క్ల్యూచెస్కీ కూడా బద్దలైందని సమాచారం. ఈ రెండు అగ్నిపర్వతాల విస్ఫోటనం వలన రష్యాలోని ఈ ప్రాంతం , అక్కడి వాతావరణం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. గతంలో కూడా, ఇదే కమ్చట్కా ప్రాంతంలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించి, రష్యా, జపాన్ మరియు ఉత్తర పసిఫిక్ తీర ప్రాంతాలపై సునామీ రూపంలో తీవ్ర ప్రభావం చూపింది. నిపుణుల ప్రకారం, 2011 తర్వాత పసిఫిక్ ప్రాంతంలో నమోదైన అత్యంత తీవ్రమైన భూకంపం ఇది.

**ప్రజలకు హెచ్చరికలు**

రష్యా, జపాన్ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తక్షణమే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సునామీ హెచ్చరికలను తీవ్రంగా పరిగణించాలని అధికారులు సూచిస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని భూ ప్రకంపనలు సంభవించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండటమే శ్రేయస్కరం.

సారాంశంగా, రష్యాలో భూకంపం , రెండు అగ్నిపర్వతాల విస్ఫోటనం ఒకేసారి సంభవించడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. ఈ విపత్కర పరిస్థితులు అక్కడి ప్రజల జీవితాలను..వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, అధికారిక హెచ్చరికలను పాటించడం చాలా ముఖ్యం.

# పదవి నుంచి తొలగించినా.. బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో రాజకీయ వేడి నిత్యం పెరుగుతూనే ఉంది. ఈ తరుణంలో కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు మరింత చర్చనీయాంశంగా మారాయి. చొప్పదండి నియోజకవర్గంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తనపై వస్తున్న ఆరోపణలకు ఘాటుగా స్పందించారు.

**"పదవి మారినా నేను మారను"**

"కేంద్ర మంత్రిగా ఉన్నా లేకున్నా నేను మారను. నేను ప్రజల మనిషిని. నాపై వచ్చే అవాస్తవాలను ప్రచారం చేయొద్దని కోరుతున్నా" అంటూ బండి సంజయ్ స్పష్టంగా చెప్పారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో తనను మంత్రి పదవి నుంచి తొలగించారని, తానే రాజీనామా చేశానంటూ జరుగుతున్న ప్రచారాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. అవన్నీ అవాస్తవాలేనని ఖండించారు.

**"పదవి కోరి కాదు.. పార్టీ ఆహ్వానం ఇచ్చి ఇచ్చింది"**

బండి సంజయ్ మాట్లాడుతూ "నాకు మంత్రిత్వం కావాలని ఎప్పుడూ కోరలేదు. పార్టీ ఆహ్వానం ఇచ్చి నాకు బాధ్యతలు అప్పగించింది. భవిష్యత్తులో పార్టీ అవసరమైతే ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా" అన్నారు. తనను టార్గెట్ చేస్తూ కొంతమంది పని లేని వారు విమర్శలు చేస్తున్నారని, కానీ తాను ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తానని హామీ ఇచ్చారు.

**"రిజర్వేషన్లపై కాంగ్రెస్ కక్షసాధింపు విధానం"**



రాజకీయంగా కీలకమైన రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ, బండి సంజయ్ బీసీ సామాజిక వర్గాలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. "42 శాతం రిజర్వేషన్ ఒక వర్గానికే ఇస్తే, మిగతా వర్గాల పరిస్థితి ఏమిటి? ముస్లింలకు 10 శాతం ఇచ్చి, అదే సమయంలో బీసీలకు 42 శాతం అంటారా? ఇది వంచన కాదు ఏమిటి?" అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.

**"బీజేపీ లక్ష్యం బీసీల అభ్యున్నతి"**

బండి సంజయ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వమే బీసీలకు మేలు చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా బీసీ వర్గానికి చెందినవాడేనని, ఆయన్ను ప్రధానిగా చేసింది బీజేపీయే అని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం గత పదకొండు సంవత్సరాల్లో 71 లక్షల కోట్ల రూపాయలు రైతులకు అందించిందని వెల్లడించారు. తనపై విమర్శలు చేస్తున్నవారిపై స్పందిస్తూ " విమర్శలు చేయడం తగదు. నేను ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చా, ప్రజల కోసమే ఉంటా. ఒక్కొక్కరి లెక్కలు త్వరలో తేలతాయి" అని బండి సంజయ్ హెచ్చరించారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు పార్టీ అంతర్గత పరిస్థితులకు, రాష్ట్ర రాజకీయాలకు ప్రాధాన్యతను చాటుతున్నాయి. పదవికి అతీతంగా ప్రజలతో మమేకమైన నాయకుడిగా కొనసాగుతానన్న ఆయన వ్యాఖ్యలు బీజేపీ వర్గాల్లో విశ్వాసాన్ని పెంచనున్నాయి. మరోవైపు, రిజర్వేషన్ అంశంపై బీసీలకు మద్దతుగా తీసుకున్న స్థానం, కాంగ్రెస్ ప్రభుత్వంపై వేసిన విమర్శలు రాజకీయ దిశలో కొత్త చర్చలకు దారి తీశాయి.

# ఉప రాష్ట్రపతిగా బీసీ నేత దక్షిణాది వారికే అవకాశం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామా తర్వాత తదుపరి ఆ బాధ్యతలు స్వీకరించే నేత ఎవరు? అన్న చర్చ ఉత్కంఠకు దారితీస్తోంది. పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్డీఏ కూటమికి సంపూర్ణ మెజార్టీ ఉండటంతో కాబోయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ నేతను ఎంపిక చేయొచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, రాజ్ నాథ్ సింగ్ తోపాటు బిహార్ కు చెందిన పలువురు నేతల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఇక ఇదే సమయంలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని కూడా త్వరలో భర్తీ చేయనుండటం, బీజేపీ అధ్యక్ష పదవిని మహిళకు కేటాయించొచ్చన్న ఊహాగానాలతో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక ఆసక్తికరంగా మారుతోంది.

ప్రస్తుతం ఉన్న సామాజిక సమీకరణల దృష్ట్యా ఉప రాష్ట్రపతిగా బీసీ నేతను ఎంపిక చేయొచ్చని తాజాగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అదీ దక్షిణాది ప్రాంతానికి చెందిన బీసీలకు అవకాశం ఇవ్వాలని సంఘ్ పరివార్ ప్రతిపాదిస్తోందని అంటున్నారు. రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ ఓబీసీ వర్గానికి చెందిన వారు. అదేవిధంగా రాష్ట్రపతిగా ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్ము ఉన్నారు. అదేవిధంగా బీజేపీ అధికారంలోకి వచ్చాక ఒక ఎస్సీ, ఒక ఎస్టీని రాష్ట్రపతి చేసింది. ఉప రాష్ట్రపతి పదవిని గతంలో ఒకసారి అగ్రవర్ణాలకు కేటాయించగా, రెండోసారి బీసీ వర్గానికి చెందిన జగదీష్ ధన్ ఖర్ కు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో బీసీ రాజీనామా చేసిన ఉప రాష్ట్రపతి పదవిని మళ్లీ అదే వర్గానికి కేటాయించడం సముచితమంటూ బీజేపీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది.

ఇక ఉప రాష్ట్రపతి అంటే ఐదేళ్ల తర్వాత రాజకీయ విరామం తీసుకోవాల్సిందేనన్న భావనతో కేంద్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న మంత్రులు వెనక్కి తగ్గుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా కేంద్ర మంత్రి వర్గంలో చక్రం తిప్పిన వెంకయ్య నాయుడును ఉప రాష్ట్రపతిని చేశారు. ఐదేళ్ల పదవీకాలం తర్వాత ఆయనను రాష్ట్రపతిగా ప్రమోట్ చేయలేదు. దీంతో ఆయన రాజకీయంగా విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నారు. ఈ కారణంతోనే జేపీ నడ్డా, రాజనాథ్ సింగ్ వంటి వారు ఉప రాష్ట్రపతి పదవిపై సముఖత వ్యక్తం చేయడం లేదని అంటున్నారు.

దీంతో ఉప రాష్ట్రపతి పదవికి తగిన బీసీ నాయకుడి ఎంపిక కోసం బీజేపీ పెద్దలు జల్లెడ పడుతున్నట్లు చెబుతున్నారు. దక్షిణాదికి చెందిన బీసీ నేతను ఎంపిక చేయాలని భావిస్తుండటంతో హరియాణా మాజీ గవర్నర్ దత్తాత్రేయ పేరు తెరపైకి వచ్చింది. ఆయన గవర్నర్ గిరీ గత నెలలోనే ముగిసింది. ఆయన స్థానంలో బీజేపీ అషిమ్ కుమార్ ఘోష్‌ను నియమించింది. దీంతో ప్రస్తుతం దత్తాత్రేయ ఏ పదవీ లేకుండా ఖాళీగా ఉన్నారు. దత్తాత్రేయను ఉప రాష్ట్రపతి చేస్తే ఏకగ్రీవం అయ్యేలా సహకరిస్తామని ఇప్పటికే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో దత్తాత్రేయ పేరు ప్రముఖంగా చర్చకు వస్తోంది. అన్నిపార్టీలతో సత్సంబంధాలు ఉన్న దత్తాత్రేయకు సౌమ్యుడిగా గుర్తింపు ఉంది. అదే సమయంలో గవర్నర్ గా, కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఆయనకు కలిసివస్తోందని అంటున్నారు. అంతేకాకుండా బీజేపీ, సంఘ్‌తో దత్తాత్రేయకు చాలాకాలంగా అనుబంధం ఉంది. ఈ పరిస్థితుల్లో ఉప రాష్ట్రపతి పదవికి దత్తాత్రేయ తగిన వారు అన్న ప్రచారం వినిపిస్తోంది.

# రసవత్తరంగా ఓవల్ టెస్ట్.. టీమిండియాకు అడ్డుకున్న రూట్, బ్రూక్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓవల్ వేదికగా ఇండియా, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఐదో టెస్టు రసవత్తరంగా జరుగుతోంది. రెండు జట్లు విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. నాలుగో రోజు తొలి సెషన్ లలో ఇంగ్లాండ్ 114 పరుగులు రాబడితే టీమిండియా రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో రెండో సెషన్ ఇరు జట్లకు అత్యంత కీలకంగా మారింది. 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ నాలుగో రోజు లంచ్ సమయానికి 3 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజ్ లో రూట్ (23), బ్రూక్ (38) ఉన్నారు. ఇండియా గెలవాలంటే 7 వికెట్లు తీయాలి. మరోవైపు ఇంగ్లాండ్ విజయానికి 210 పరుగులు అవసరం. వికెట్ నష్టానికి 50 పరుగులతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్ తొలి అరగంట సేపు వికెట్ కోల్పోకుండా జాగ్రత్తగా ఆడింది. పోప్, డకెట్ కలిసి ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో డకెట్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. లక్ష్యం వైపుగా దూసుకెళ్తున్న ఇంగ్లాండ్ కు ప్రసాద్ కృష్ణ బిగ్ షాక్ ఇచ్చాడు. డకెట్ (54) ను ఔట్ చేసి టీమిండియాకు రెండో వికెట్ అందించాడు. కాసేపటికే కెప్టెన్ పోప్ (27) ను సిరాజ్ పెవిలియన్ కు పంపాడు. దీంతో 106 పరుగుల వద్ద ఇంగ్లాండ్ మూడో వికెట్ కోల్పోయి కష్టాల్లో పడినట్టు కనిపించింది. ఈ దశలో ఇంగ్లాండ్ ను రూట్, బ్రూక్ భాగస్వామ్యం నిలబెట్టింది. ఒక ఎండ్ లో రూట్ ఆచితూచి ఆడుతుంటే మరో ఎండ్ లో బ్రూక్ భారత బౌలర్లపై ఎదురు దాడికి దిగాడు. దీంతో వేగంగా పరుగులు వచ్చాయి. ప్రసిద్ బౌలింగ్ లో బ్రూక్ ఇచ్చిన క్యాచ్ సిరాజ్ బౌండరీ దగ్గర విడిచిపెట్టడంతో ఇంగ్లాండ్ ఊపిరి పీల్చుకుంది. ఇద్దరూ మరో వికెట్ పడకుండా తొలి సెషన్ ముగించారు. భారత బౌలర్లలో సిరాజ్ కు రెండు వికెట్లు దక్కాయి. ప్రసిద్ కృష్ణ ఒక వికెట్ తీసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్ లో ఇండియా 224 పరుగులకు ఆలౌట్ అయితే.. ఇంగ్లాండ్ 247 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్ లో ఇండియా 396 పరుగులకు ఆలౌట్ అయింది.

# ఇలా షాక్ ఇచ్చావేంటి హిట్ మ్యాన్: రూ.2.46 కోట్ల వాచ్ ధరించిన రోహిత్ శర్మ






**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ టెస్ట్ కెప్టెన్ రోహిత్ శర్మ ఓవల్ టెస్ట్ చూడడానికి వచ్చి ఫ్యాన్స్ ను సర్ ప్రైజ్ చేసిన సంగతి తెలిసిందే. శనివారం (ఆగస్టు 2) ఉదయం లండన్‌లోని ది ఓవల్‌లో కనిపించిన రోహిత్ మూడో రోజు ఆటకు హాజరయ్యాడు. చాలా సింపుల్ డ్రెస్ వేసుకొని.. కూలింగ్ గ్లాస్ పెట్టుకొని రిలాక్స్‌గా మ్యాచ్ ఎంజాయ్ చేస్తూ కనిపించాడు. గ్రౌండ్ లో ఉన్న ప్రేక్షకులు హిట్ మ్యాన్ కు చప్పట్లు కొడుతూ ఆహ్వానించారు. జైశ్వాల్ సెంచరీ కొట్టిన తర్వాత చప్పట్లు కొడుతూ భారత యువ జట్టును ఎంకరేజ్ చేస్తూ కనిపించాడు. ఓవల్ టెస్టుకు రోహిత్ శర్మ రావడం ఒక విశేషమైతే.. హిట్ మ్యాన్ తన చేతికి పెట్టుకున్న వాచ్ మరొక విశేషం. సెలెబ్రిటీలు భారీ వస్తువులను కొనడం.. ధరించడం చాలా కామన్. కానీ రోహిత్ శర్మ వాచ్ ఖరీదు నోరెళ్లబెట్టేలా చేస్తోంది. ఓవల్ టెస్టుకు రోహిత్ శర్మ టైటానియం వాచ్ ధరించాడు. దీని ధర అక్షరాలా 2.46 కోట్లు కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏదైనా హిట్ మ్యాన్ తన వాచ్ తో ఒక్కసారిగా అందరినీ షాక్ కు గురి చేశాడు. టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. స్వదేశంలో న్యూజిలాండ్ తో మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ క్లీన్ స్వీప్ కావడం.. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 1-3 తేడాతో కోల్పోవడం హిట్ మ్యాన్ టెస్ట్ కెరీర్ పై తీవ్ర ప్రభావం చూపించింది. దీనికి తోడు బ్యాటింగ్ లో పేలవ ఫామ్ అతని రిటైర్మెంట్ కు కారణమైంది. రోహిత్‌శర్మ టెస్ట్ క్రికెట్ లో 67 టెస్టుల్లో 4,301 పరుగులు చేశాడు. వీటిలో 12 సెంచరీలు 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇప్పటికే టీ20 ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్.. ఇకపై కేవలం వన్డే క్రికెట్ మాత్రమే ఆడనున్నాడు.

ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్ విషయానికి వస్తే 374 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ నాలుగో రోజు లంచ్ సమయానికి 3 వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజ్ లో రూట్ (23), బ్రూక్ (38) ఉన్నారు. ఇండియా గెలవాలంటే 7 వికెట్లు తీయాలి. మరోవైపు ఇంగ్లాండ్ విజయానికి 210 పరుగులు అవసరం. నాలుగో రోజు తొలి సెషన్ లలో ఇంగ్లాండ్ 114 పరుగులు రాబడితే టీమిండియా రెండు వికెట్లు పడగొట్టింది.

# సచిన్, కోహ్లిలలో ఎవరు బెస్ట్.. డివిలియర్స్ సమాధానమిదే!






**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ టీమిండియా తరపున బ్యాటింగ్ రికార్డులన్నీ తమ పేరిట లిఖించుకున్నారు. అప్పటి తరంలో సచిన్ ప్రత్యర్థులకు చుక్కలు చూపించేవాడు. ఇప్పుడు కింగ్ కోహ్లీ క్రీజ్ లో ఉంటే ఎదురుగా ఎలాంటి జట్టు ఉన్నా బెంబేలిత్తిస్తాడు. రెండు దశాబ్దాలుగా సచిన్ బౌలర్లపై ఆధిపత్యం చూపిస్తే.. మోడ్రన్ క్రికెట్ లో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ కు ఐకాన్ గా మారాడు. ఈ ఇద్దరిలో ఎవరు గ్రేట్ అనే విషయం చెప్పడం కష్టం. అయితే ఇదే ప్రశ్న సౌతాఫ్రికా దిగ్గజ బ్యాటర్, మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్ కు ఎదురైంది.వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ ఫైనల్ తర్వాత శుభంకర్ మిశ్రా పాడ్‌కాస్ట్ లో మాట్లాడుతూ తన అభిప్రాయాన్ని చెప్పాడు. డివిలియర్స్ మాట్లాడుతూ.. "నాకు సచిన్ అంటే చాలా గౌరవం ఉంది. ఎంత ఎదిగినా ఒదిగి ఉంటాడు. విరాట్ నాకు ఫ్రెండ్. ఇద్దరు రెండు జెనరేషన్స్ కు చెందినవారు. వారిద్దరిని పోల్చడం సరికాదు. కాబట్టి చెప్పడం చాలా కష్టం. విరాట్ అన్ని ఫార్మాట్లలో గొప్ప ఆటగాడని నేను అనుకుంటున్నాను. సచిన్ లాంగ్ ఫార్మాట్‌లో గ్రేట్". అని డివిలియర్స్ అన్నాడు.

తాజాగా ముగిసిన వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో డివిలియర్స్ తన విశ్వ రూపాన్ని చూపించాడు. పాకిస్థాన్ తో జరిగిన ఫైనల్లో 60 బంతుల్లోనే 7 సిక్సర్లు, 12 ఫోర్లతో 120 పరుగులు చేసి పాకిస్థాన్ కు చుక్కలు చూపించాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌లలో 431 పరుగులు చేసి టోర్నీ టాప్ స్కోరర్ గా నిలిచాడు. డివిలియర్స్ యావరేజ్ 143.67 కాగా.. స్ట్రైక్ రేట్ 221.03 ఉండడం విశేషం. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులు డివిలియర్స్ కే లభించాయి.

2018, ఫిబ్రవరిలో సౌతాఫ్రికా తరపున చివరి అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడిన ఏబీడీ.. అదే ఏడాది ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ప్రొటీస్ జట్టుకు ఆఖరుసారి ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో డివిలియర్స్ 5 వేలకు పైగా పరుగులు చేయడం విశేషం. ఇక అంతర్జాతీయ క్రికెట్ విషయానికొస్తే.. 114 టెస్టుల్లో 8,765 రన్స్, వన్డేల్లో 228 మ్యాచ్‌లు ఆడి 9,577 పరుగులు చేశాడు. ఇక టీ20 ల్లో 78 మ్యాచుల్లో 1,672 పరుగులు చేశాడు.

# తమన్నా పెళ్లి.. అతడు ఎవరో తెలుసా?

ఒక రోజు క్రికెటర్ తో .. మరో రోజు సహనటుడితో.. ఇంకోరోజు డాక్టర్- బిజినెస్‌మేన్‌తో... ఇకపైనా ఎవరితో ముడిపెడతారో తెలీదు! మొత్తానికి తమన్నా ఎవరో ఒకరిని పెళ్లాడేయబోతోందనే పుకార్లు ఇప్పటికీ ఆగడం లేదు. తమన్నా భాటియా- విజయ్ వర్మ ప్రేమాయణం, జంట షికార్ల గురించి చాలా కాలం పాటు ప్రచారం సాగింది. కానీ ఈ జంట బ్రేకప్ అవ్వడం అభిమానులకు షాకిచ్చింది. ఇది ఊహించనిది. కానీ కాలంతో పాటే గతించిపోయే శాశ్వత నిజం.



**నిప్పు లేదు పొగ లేదు అయినా..**

అయితే తమన్నాను ఇప్పటికీ మీడియాలు వదిలి పెట్టడం లేదు. మిల్కీ వైట్ బ్యూటీకి ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారంటూ నెటిజనుల్లో నిరంతరం ప్రచారం సాగుతూనే ఉంది. కథానాయికల విషయంలో ఇలాంటి ప్రచారం సహజమే అనుకున్నా, నిప్పు లేదా పొగ ఈ రెండిటిలో ఏ ఒక్కటీ లేకపోయినా ఇలాంటివి ఎలా పుట్టిస్తున్నారో ఎవరికీ అర్థం కాని గందరగోళాన్ని సృష్టిస్తోంది.

**పాకిస్తానీ క్రికెటర్ ని కలిసాను:**

ఒకానొక సందర్భంలో తమన్నా మాట్లాడుతూ.. తనపై సాగుతున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేకపోయానని అన్నారు. ఒకసారి పాకిస్తాన్ క్రికెటర్ అబ్దుల్ రజాక్ తో ముడిపెట్టారని కూడా ఆవేదన చెందారు. అబ్దుల్ రజాక్ నేను ఓ ఆభరణాల దుకాణం ఓపెనింగులో కలిసాం. ఆ షాప్ పేరేమిటో తెలీదు కానీ, అతడిని నేను కలిసాను అని నెటిజనులు రాసారు. రజాక్ ని పెళ్లాడుతున్నానని కూడా ప్రచారం చేసారు.



మీతా రఘునాథ్ తన తాజా చిత్రంలో సహజంగా మరియు తాజాగా ఉంచారు

**నా భర్త నేను షాపింగ్‌లో..**

ఓ పాడ్ కాస్ట్ లో ఈ విచిత్రమైన ప్రచారం గురించి ప్రస్థావిస్తూ తమన్నా కొంత ఇబ్బందికరంగా ఫీలైంది. సహ నటుడు, డాక్టర్ లేదా క్రికెటర్ తో నన్ను ఎవరో ఒకరితో ముడి వేస్తారు. నేను నా భర్త షాపింగ్ లో ఉన్నామనే భావన తెచ్చేస్తారు. ప్రేమలో ఉండటం అనే ఆలోచన నాకు చాలా ఇష్టమే అయినా కానీ, నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే నేను నిరాధారమైన వార్తలను అంగీకరించను. నేను ప్రస్తుతం ఒంటరిగా సంతోషంగా ఉన్నాను. నా తల్లిదండ్రులు వరుడి కోసం వెతుకులాటలో లేరు..! అని కూడా తమన్నా తనపై తప్పుడు ప్రచారాన్ని ఖండించారు.

**ప్రస్తుతం ఒంటరిని...**

నేను ప్రస్తుతం ఒంటరిగా ఉన్నాను.. ఒకవేళ ప్రేమలో పడ్డాను అంటే అది కేవలం సినిమాలతో మాత్రమే. నిరంతరం సినిమాల్లో నటించేందుకు వెతుకుతూనే ఉంటాను. అసలు ఈ ఊహాగానాలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తాయో కానీ ఒక్కటీ నిజం కాదు. నేను నా మార్గంలో వెళుతున్నాను. ఒకవేళ గౌరవనీయమైన వివాహవ్యవస్థలోకి అడుగుపెడితే కచ్చితంగా అందరికీ చెబుతాను. నాపై తప్పుడు కథనాలు రాయడం అగౌరవం అని కూడా తమన్నా నాటి పాడ్ కాస్ట్ లో వ్యాఖ్యానించారు.

**వరుస చిత్రాలతో బిజీ..**

కెరీర్ మ్యాటర్ కి వస్తే.. తమన్నా ఇటీవల ఓదెలా 2 చిత్రంతో అభిమానులను అలరించింది. యాక్షన్ హీరో అజయ్ దేవగన్ సరసన - రైడ్ 2 - లోను నటించింది.

ప్రస్తుతం వరుస చిత్రాలతో మిల్కీ బిజీ బిజీగా ఉంది. బాలీవుడ్ లో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ చిత్రంలో నటిస్తున్న తమన్నా, - వి-వాన్- ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్ - అనే చిత్రంలోను నటిస్తోంది. అడవి నేపథ్యంలో రూపొందుతున్న - రేంజర్ - లో అజయ్ దేవగన్ సరసన తమన్నా ఆడిపాడనుంది. ఈ సినిమాని ఇటీవలే ప్రకటించారు.



Saiee యొక్క ఫ్యాషన్ ఎంపికలు మొత్తం హృదయాన్ని కదిలించేవి

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com